

మామిడి రైతులూ..
ఆందోళన పడొద్దు

తోతాపురి రకాన్ని చివరి కిలో వరకు కొంటాం : కలెక్టర్



బంగారుపాళ్యంలోని మార్కెట్ యార్డులో రైతులు, వ్యాపారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, వేదికపై జేసీ విద్యాధరి తదితరులు

బంగారుపాళ్యం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులూ ఆందోళన పడొద్దు.. చివరి కిలో వరకు తోతాపురి రకాన్ని కొంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం బంగారుపాళ్యంలోని మార్కెట్ యార్డులో మండీ యజమానులు, మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ రాదని భావించి.. పక్వానికి రాకముందే మామిడి కాయలను కోసి గుజ్జుపరిశ్రమలకు తరలించరాదని రైతులకు సూచించారు. ఆగస్టు నెల వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా నుంచి అధికారుల కమిటీని తమిళనాడు రాష్ట్రంలోని కృష్ణగిరికి పంపామని, రైతుల నుంచి మామిడి కొనుగోలు, నగదు ఇచ్చే విధానాన్ని పరిశీలించి రెండ్రోజుల్లో నివేదిక ఇవ్వనున్నారని చెప్పారు. ర్యాంపులు, ఫ్యాక్టరీల వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయిస్తామన్నారు. తోతాపురి రకాన్ని గుజరాత్‌లోని బలగాం మార్కెట్లకు ఎగుమతి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వివరించారు. జేసీ కలెక్టర్ విద్యాధరి, ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్, తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటరమణ, సూపర్‌వైజర్ గంగయ్య, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

గుజ్జు పరిశ్రమను పరిశీలించిన జేసీ

నలగాంపల్లె వద్ద ఉన్న సన్‌గోల్డ్ గుజ్జు పరిశ్రమను గురువారం ఉదయం జేసీ విద్యాధరి పరిశీలించారు. మేనేజర్ ధనంజయనాయుడితో మాట్లాడారు. రైతుల నుంచి ప్రభుత్వం ప్రకటించిన ధరకు మామిడి కొనుగోలు చేయాలని సూచించారు. పర్మిట్‌లు ఇప్పించాలని రైతులు కోరగా.. ఈనెల 30వ తేదీ వరకు మంజూరు చేసేశామని జేసీకి మేనేజర్ తెలిపారు. ఉద్యానశాఖ అధికారి కోటేశ్వర్‌రావు, ఏవో భారతి, తహసీల్దార్ తదితరులున్నారు.

ధర విషయంలో ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

ఫ్యాక్టరీల యాజమాన్యాలకు తేల్చి చెప్పిన సుమిత్‌కుమార్

గంగాధరనెల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం మామిడి కాయలకు మద్దతు ధర విషయంలో ప్రభుత్వ ఆదేశాలు పాటించాలని ఫ్యాక్టరీల యాజమాన్యాలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ తేల్చి చెప్పారు. గంగాధరనెల్లూరు పంచాయతీ పరిధి తూగుండ్రం వెళ్లే రహదారిలోని జైన్ ఫ్యాక్టరీ-2ని గురువారం ఆయన సందర్శించారు. అనంతరం ఫ్యాక్టరీ ఆవరణంలో యాజమాన్యం, రైతులతో సమీక్షించారు. మద్దతు ధరకంటే తక్కువకు కొనుగోలు చేస్తే అలాంటి ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫ్యాక్టరీల వద్ద రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లకు ప్రభుత్వ సహకారంతో తహసీల్దార్, ఎంపీడీవో తమ సిబ్బందితో కలిసి శుక్రవారం నుంచి రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజన సౌకర్యంతో పాటు విశ్రాంతి తీసుకోవడానికి షెల్టర్, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, జైన్‌ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ దిలీప్, ఇన్‌చార్జి తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్ పాల్గొన్నారు. కాగా 100 గొల్లపల్లె వద్ద ఉన్న జైన్ ఫ్యాక్టరీ-1ని గురువారం రాత్రి 8.30 గంటలకు కలెక్టర్ సందర్శించారు. అక్కడున్న రైతులతోమాట్లాడారు. ఇబ్బందులున్నాయా అంటూ ఆరా తీశారు. అనంతరం టోకెన్ల జారీ ప్రక్రియను పరిశీలించి, యాజమాన్యానికి సూచనలిచ్చారు.



100 గొల్లపల్లెలోని జైన్ ఫ్యాక్టరీ వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సిఫార్సులకు స్వస్తి పలికి రైతులకు న్యాయం చేయండి

గుడిపాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పల్ప్ ఫ్యాక్టరీల యజమానులు సిఫార్సులకు స్వస్తి పలికి.. మామిడి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీని గురువారం తనిఖీ చేశారు. పక్క రాష్ట్రాల నుంచి వచ్చే కాయలను కొనుగోలు చేయొద్దని ఫ్యాక్టరీ యాజమాన్యానికి సూచించారు. టోకెన్ల ప్రకారం అన్‌లోడ్ జరిగేలా చూడాలని అక్కడున్న ఉద్యోగులకు ఆదేశాలిచ్చారు. రైతులు వివరాలు పక్కాగా నమోదు చేయాలని, అప్పుడే వారికి ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ అందుతుందని తెలిపారు. ఫ్యాక్టరీ మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, హరీష్, ఎస్‌ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ముందు రైతుల నిరసన

చిత్తూరు సెంట్రల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను ఆదుకోవడంలో జిల్లా యంత్రాంగం విఫలమైందని, ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి మాటలకు కూడా విలువ లేకుండా పోయిందని నిరసిస్తూ శనివారం కలెక్టరేట్ ముందు సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్లు మామిడి రైతుల సంక్షేమ సంఘం కన్వీనర్లు టి.జనార్దన్, ఆనందనాయుడు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మునీశ్వర్ రెడ్డి అధ్యక్షతన గురువారం వర్చువల్ సమావేశం నిర్వహించి.. మామిడి రైతులకు జరుగుతున్న అన్యాయం, ఫ్యాక్టరీలు, ర్యాంపులు, మండీల్లో ధరలు లేకపోవడం తదితర అంశాలపై చర్చించారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ ముందు నిరసన చేపట్టాలని నిర్ణయించారు. సమావేశానికి హరిబాబు, ఉమాపతినాయుడు, సంజీవరెడ్డి, భారతి తదితరులు హాజరయ్యారు.

హయాతి ఫ్యాక్టరీని తనిఖీ చేసిన జేసీ

చిత్తూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని హయాతి జూస్ ఫ్యాక్టరీని గురువారం సాయత్రం జేసీ విద్యాధరి తనిఖీ చేశారు. ట్రాక్టర్ నుంచి కాయలను అన్‌లోడ్ చేయడానికి రైతుల నుంచి ఫ్యాక్టరీ వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో జేసీ ఇక్కడికొచ్చారు. రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించారు.

'యోగాంధ్ర'లో విద్యాశాఖ వెనుకబాటు

చిత్తూరు సెంట్రల్,జూన్19(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాన్ని పాఠశాలల్లో నిర్వహించే అంశంలో జిల్లా విద్యాశాఖ వెనుకబడింది. జిల్లాలోని 2,462 ప్రభుత్వ బడుల్లో 1,48,189మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యాశాఖకు ఇచ్చి ప్రణాళిక ప్రకారం ఈ విద్యార్థులతో యోగా చేయించి, వాటిని సమగ్ర శిక్ష వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కేవలం ఇక రెండ్రోజుల సమయమే ఉన్నా.. ఇప్పటివరకు 68 శాతం కూడా లక్ష్యాలను విద్యాశాఖ అధికారులు పూర్తి చేయలేకపోయారు. ఈ రెండ్రోజుల్లో వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తారా? లేదా? వేచి చూడాలి.

టీచర్లూ.. ఇదేం పని?

తప్పుడు సమాచారమిచ్చి.. బదిలీల్లో ప్రయోజనాలు

చర్యలకు సిద్ధమవుతున్న విద్యాశాఖ

చిత్తూరు సెంట్రల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎస్)లో తప్పుడు సమాచారమిచ్చిన.. బదిలీల్లో ప్రయోజనాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవడానికి విద్యాశాఖ సిద్ధమవుతోంది. ఇలాంటి కేసులకు ఇప్పటి వరకు 135 మందికిపైగా గుర్తించినట్లు సమాచారం. విచారించే కొద్దీ మరిన్ని బయటపడనున్నాయి. మరోవైపు నష్టపోయిన టీచర్లు కూడా తమకు ఎవరి వల్ల ఈ పరిస్థితి వచ్చిందో పూర్తి వివరాలను లిఖిత పూర్వకంగా విద్యాశాఖ అధికారులకు ఇస్తున్నారు. వీటిని కూడా పరిశీలించాక వాస్తవమని తేలితే ఆయా టీచర్లపై అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

పలమనేరుకు 'గణేష్'



ముసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపునకు కొత్తగా వచ్చిన కుంకీ ఏనుగు

పలమనేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని ముసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపునకు గురువారం మధ్యాహ్నం మరో కుంకీ ఏనుగు చేరింది. తిరుపతి ఎస్వీ జూపార్కు నుంచి గణేష్ అనే పేరున్న ఈ కుంకీ ఏనుగును లారీలో తీసుకొచ్చారు. ఇప్పటికే ఇక్కడ అరు కుంకీ ఏనుగులు ఉన్నాయి. గణేష్ రాకతో ఈ సంఖ్య ఏడుకు చేరింది. కొత్తగా వచ్చిన గణేష్ ద్వారా ఇక్కడున్న ఏనుగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిసింది.

ఐటీఐలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఖాళీగా ఉన్న సీట్లకు రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలనేవారు శుక్రవారం నుంచి జూలై 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా iti.ap.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐకి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చే నెల 21, 22 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ప్రైవేటు ఐటీఐలకైతే వచ్చేనెల 23, 25తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 91825 90869 నెంబరును సంప్రదించాలని కోరారు.

సర్కారు బడుల బలోపేతంపై దృష్టేది?

సెక్టోరియల్ అధికారుల తీరుపై విమర్శలు ● అసహనం వ్యక్తం చేస్తున్న టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు

సర్కారు బడులను బలోపేతం చేయడంపై విద్యాశాఖ, సమగ్ర శిక్ష (ఎస్ఎస్) అధికారులు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలొస్తున్నాయి. పాఠశాలలు పునః ప్రారంభమై వారం రోజులు దాటినా ఎస్ఎస్ పరిధిలోని సెక్టోరియల్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి



జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం

జిల్లా వ్యాప్తంగా 489 మోడల్ ప్రైమరీ పాఠశాలలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం ఈ పాఠశాలల్లో కనీసం 60 మంది విద్యార్థులు ఉండాలి. ఇప్పటికీ చాలా వరకు సరిపడా పిల్లలు లేకపోయినా పట్టించుకునేవారు కరువయ్యారన్న విమర్శలున్నాయి. చాలాచోట్ల మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విలీనం చేసిన పాఠశాలల నుంచి విద్యార్థులు చేరకపోయినా, వారిని ఒప్పించడంలో సెక్టోరియల్ అధికారులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి. జిల్లాలోని 2,462 ప్రభుత్వ బడుల్లో 1,48,189 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 1,949 ప్రాథమిక పాఠశాలల్లో 52,469 మంది, 158 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 10,293 మంది, 355 ఉన్నత పాఠశాలల్లో 85,668 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద స్టూడెంట్ కిట్స్ ఉచితంగా అందజేస్తోంది. ఇప్పటివరకు జిల్లాలో ఎంతమంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఈ కిట్లు అందాయన్న దానిపైనా సమగ్ర సమాచారం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

కార్యాలయానికి పరిమితం

సెక్టోరియల్ అధికారులు రోజూ ఒక పాఠశాలను సందర్శించాలి. ఉదయం ప్రార్థన సమయం నుంచి మధ్యాహ్నం భోజనం వరకు అక్కడే ఉండి, ఇటు పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, అటు బోధనాపరమైన అంశాలను పరిశీలించాలి. లేబర్, పోలీసు, శాఖల సంయుక్త సహకారంతో బడిఈడు పిల్లల్ని, బడిమానేసిన పిల్లల్ని బడిలో చేర్పించాలి. జిల్లాలో అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. గతంలో సెక్టోరియల్ అధికారులు అరకొరగా, డిప్యుటేషన్‌పై ఉండేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. పూర్తిస్థాయిలో నియామకం జరిగింది. వీరు కేవలం కార్యాలయానికే పరిమితమై.. నివేదిక పేరుతో ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారన్న చర్చ విద్యాశాఖలో నడుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

పర్యవేక్షణ బాధ్యత సెక్టోరియల్ అధికారులదే



పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత సమగ్ర శిక్ష పరిధిలోని సెక్టోరియల్ అధికారులదే. బడి మానేసిన, బడి బయటి పిల్లల్ని బడిలో చేర్పించే కార్యక్రమాలు చేపట్టాలి. దీనిపై ఇప్పటికే ఎస్ఎస్ ఏపీసీకి తగిన ఆదేశాలు జారీ చేశాం.

- వరలక్ష్మి, డీఈవో

గురుకులాల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఆ విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ టి.పద్మజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని బాలుర పాఠశాలలో రామకుప్పం, పూతలపట్టు, విజలాపురం పాఠశాలలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే బాలికలకు చిత్తూరు, పలమనేరు, జీడీ నెల్లూరు, కుప్పం పాఠశాలల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆయా విద్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నవారికి ఈనెల 25వ తేది ఉదయం 10 నుంచి 11 గంటల వరకు చిత్తూరులోని బాలికల పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

న్యాయం కోసం రోడ్డెక్కిన కుటుంబం

● పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుల ధర్నా



రూరల్ సీఐతో గోడు వెళ్లబోసుకుంటున్న శాంతమ్మ

కుప్పం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేసు పెట్టినా పోలీసులు తగిన న్యాయం చేయలేదంటూ కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్ ఎదుట గురువారం ఓ కుటుంబం ఆందోళనకు దిగింది. శీనప్ప భార్య శాంతమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుప్పం మండలం జరుగు గ్రామంలోని శీనప్ప భార్య శాంతమ్మ కుటుంబానికి, రామప్ప భార్య శాంతమ్మ కుటుంబానికి పక్కపక్కనే ఇళ్ల స్థలాలు ఉన్నాయి. సరిహద్దు వివాదంపై కోర్టులో కేసు నడుస్తోంది. ఈనెల 12న ఉదయం నుంచే ఇళ్ల స్థలాల మధ్య ఉన్న హద్దు రాళ్లను రామప్ప, ఆయన భార్య శాంతమ్మ కుటుంబ సభ్యులు తొలగించి ప్రహరీ నిర్మించడానికి ప్రయత్నించారు. ఇదేమని ప్రశ్నించిన శీనప్ప భార్య శాంతమ్మతోపాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడిచేసి గాయపరిచారు. దాడిచేసిన పక్కింటి జాగా వాళ్లపై ఈనెల 13వ తేదీన కుప్పం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గురువారం కుటుంబ సభ్యులతో కలిసి పోలీసుస్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ న్యాయం చేస్తామని చెప్పడంతో శాంతమ్మ కుటుంబ సభ్యులు ధర్నా విరమించి గ్రామానికి తిరిగి వెళ్లారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6 నుంచి 9వ తరగతి వరకున్న మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాయుడుపేట, చిల్లకూరు, కోట, వాకాడులోని బాలుర పాఠశాలలు.. పుదూరు, సూళ్ళూరుపేట, డక్కిలి, సత్యవేడు, శ్రీకాళహస్తి, పుత్తూరులోని బాలికల పాఠశాలల్లో మిగులు సీట్లకు ఆయా విద్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 25న శ్రీకాళహస్తిలోని బాలికల పాఠశాలలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఉన్నతాధికారులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. వీరిలో విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్, ఆర్కియాలజీ, మ్యూజియం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రజిత ఉన్నారు.





కలెక్టర్‌ను కలిసిన వినోద్, రజిత ←


శ్రీహరి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు


బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,440

తలనీలాలు సమర్పించినవారు: 33,687



ఉగ్రవాదులను ఎదుర్కొంటాం





● తిరుమలలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

అతిథిగృహం ముందు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బంది



తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వీవీఐపీలు బస చేసే పద్మావతి అతిథిగృహంలో బుధవారం అర్ధరాత్రి ఆక్టోపస్ మాక్‌డ్రిల్ జరిగింది. దేశసరిహద్దుల్లో గతంలో నెలకొన్న యుద్ధపరిస్థితుల నేపథ్యంలో తిరుమల, తిరుపతిలో ఆక్టోపస్, పోలీసులు వరుసగా మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే పద్మావతి అతిథి గృహంలోనూ మాక్‌డ్రిల్ నిర్వహించారు.

మాక్ డ్రిల్ సాగిందిలా..

పద్మావతి అతిథిగృహంలో ఉగ్రవాదులు ప్రవేశించారని బుధవారం రాత్రి 9.20 గంటలకు తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ఆక్టోపస్ కమాండ్ కంట్రోల్‌కు సమాచారాన్ని చేరవేశారు. స్పందించిన ఆక్టోపస్ అధికారులు, వివిధ విభాగాల సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. అత్యంత స్పష్టమైన ప్రణాళికతో మాక్ ఆపరేషన్‌ను ప్రారంభించారు. ప్రణాళిక ప్రకారం ఆక్టోపస్ సిబ్బంది ఆయుధాలతో అతిథిగృహం వద్దకు చేరుకుని ఓ అగంతకుడిని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు ఉగ్రవాదులను హతమార్చారు. గాయపడిని ఓ సెక్యూరిటీ గార్డును ఆస్పత్రికి తరలించారు. అనుకున్న విధంగానే ఆపరేషన్‌ను ఐదుగంటల్లో పూర్తిచేసి మాక్ డ్రిల్‌ను ముగించారు. ఈ ఆపరేషన్‌లో ఆక్టోపస్‌తో పాటు స్థానిక పోలీసులు, రిజర్వ్ పోలీసులు, టీటీడీ విజిలెన్స్, బాంబ్ స్క్వాడ్, ఫైర్ టీం, మెడికల్ విభాగాలు పాల్గొన్నాయి.



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

శాఖల వారీగా భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ

● టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడి

తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు టీటీడీలో అందిస్తున్న సేవలపై క్రమం తప్పకుండా అభిప్రాయ సేకరణ జరిపి, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు భక్తుల నుంచి సేకరించిన ఫీడ్‌బ్యాక్‌పై చర్చించారు. శ్రీవారి దర్శనం, అన్నప్రసాదాలు, వడ పంపిణీ, వసతి, కాలినడక భక్తులకు అందజేస్తున్న సేవలు, లగేజీ, కల్యాణకట్ట, వైద్యం, పారిశుద్ధ్యం, విజిలెన్స్, ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలపై భక్తుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నామని, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వెంగమాంబ అన్నప్రసాద భవనంలో పెరిగిన రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు హాళ్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. అన్నప్రసాదాల పంపిణీలో ఆలస్యం చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. బియ్యం, ముడిసరుకుల నాణ్యతను పరీక్షించేందుకు ఆధునిక పరికరాలను ఉపయోగించి మరింత రుచికరమైన అన్నప్రసాదాలను అందించాలన్నారు. వసతి గృహాల్లో సకాలంలో పరిశుభ్రతా ప్రమాణాలను పాటించేందుకు వీలుగా రిసెప్షన్, ఐటీ విభాగాలు సమన్వయంతో ఎఫ్ఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రద్దీ సమయాల్లో లడ్డూ కౌంటర్ వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా పంపిణీ జరగాలన్నారు. రద్దీకి తగినట్టు సిబ్బందిని పెంచాలన్నారు. ట్రాన్స్‌పోర్టు, కల్యాణకట్టల్లోని భక్తుల వసతులపై అధిక శ్రద్ధ వహించాలన్నారు. తిరుమలలో వసతి బస్సుల సదుపాయ సమాచారాన్ని మైకుల ద్వారా ప్రకటనలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి(వర్చువల్), జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలు, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక హెల్ప్‌లైన్

● పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తాం ● జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ వెల్లడి

తిరుపతి(వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'మహిళల రక్షణ, వారి హక్కుల పరిరక్షణకు మహిళా కమిషన్ 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. మీ సమస్యలపై ప్రత్యేక హెల్ప్‌లైన్, మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. వీటిపై తక్షణమే విచారించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం' అని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్రీయ మహిళా అయోగ్ ఆప్కేద్వార్, మహిళా జన్‌సున్వై కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరకట్నం, సైబర్ నేరాలు, లైంగిక నేరాలు తదితర సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో పెండింగులో ఉన్న మహిళా కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళల సమస్యలను పరిష్కరించే దిశగా 8 జిల్లాల గ్రీవెన్స్‌కు సంబంధించి ఈ మహిళా జన్‌సున్వై కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోఖాయ బేగం మెంబర్, అడ్వకేట్‌లు కంచి శ్యామల, కోమలాదేవి శారద, నేశమ చౌదరి, చంద్రశేఖర్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి వసంతబాయి, పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను డాక్టర్ అర్చన మంజుదార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని అధికారులను ఆమె ఆదేశించారు.



సమస్యను వింటున్న మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్, అధికారులు

● ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ సాయిలక్ష్మి సమక్షంలో కొందరు ఆమెకు వినతిపత్రాలను సమర్పించారు. భూ అమ్మకంలో మధ్యవర్తిగా వ్యవహరించినందుకు తిరుచానూరు పోలీసులు హేమలత అనే మహిళపై దాడికి పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు.

● 'తిరుపతి రూరల్ మండలం బీటీఆర్ అంబేడ్కర్ కాలనీకి చెందిన ఆటో కార్మికురాలు భాగ్యశ్రీతో మాట్లాడాలని ఇంటికి పిలిపించి ధనశేఖర్ అనే వ్యక్తి మరికొంత మందితో కలిసి దాడి చేశారు. ప్రధాన నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చకుండా పోలీసులు తప్పించారు' అంటూ వినతి పత్రం అందించారు. 15 రోజుల్లోపు వీటిపై విచారించి తమకు నివేదిక పంపాలని పోలీసు అధికారులకు కమిషన్ సభ్యురాలు ఆదేశించారు.

ప్రసూతి ఆస్పత్రి తనిఖీ

తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చనమంజుదార్ గురువారం తనిఖీ చేశారు. పలు వార్డులను పరిశీలించారు. వైద్యసేవల గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. మహిళల రక్షణ, హక్కులపై అవగాహన కల్పించే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పది మంది కంటే ఎక్కువ మంది మహిళలు పని చేసే కార్యాలయాల్లో, సంస్థల్లో ఐసీసీ(ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ)ని ఏర్పాటు చేయాలన్నారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రాధా, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పల్లం పాఠశాలలో శ్రీలంక ప్రతినిధులు

ఏర్పేడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో విద్యావ్యవస్థ అధ్యయనంలో భాగంగా శ్రీలంకకు చెందిన సుమారు 45మంది విద్యావేత్తలు గురువారం మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బోధనా విధానం, ఉపాధ్యాయల పనితీరు పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో సమకూర్చిన వసతులపై వారు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. భారతదేశంలో విద్యావ్యవస్థ చాలా పటిష్ఠంగా ఉందని శ్రీలంక ప్రతినిధులు మహేందర్, ఫెరారీ కొనియాడారు. శ్రీలంక మహిళా ఉపాధ్యాయులు తమ దేశ సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. అనంతరం వారిని ఉపాధ్యాయులు సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, శ్రీనివాసులు, బాబు, సోమశేఖర్, వాణి, విజయ, శేఖర్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు కేవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఏర్పేడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ఏర్పేడు ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయంలో పలు తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమేస్ బజ్జూరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు నేరుగా తమను సంప్రదించవచ్చన్నారు: 1వ తరగతిలో ఎస్టీ 1, సీడబ్ల్యూఎస్ఎన్ 1, 2వ తరగతిలో ఎస్టీ 1, 3వ తరగతిలో ఎస్టీ 1, 4వ తరగతిలో 26, 5వ తరగతిలో ఎస్సీ 1, ఎస్టీ 1ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచండి

● రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

తిరుపతి(సెంట్రల్), జూన్19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచాలని సికింద్రాబాద్ జోనల్ జీఎం అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో గురువారం ఆయన తనిఖీ చేశారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఉత్తరం వైపు జరుగుతున్న పనుల్లో ఆలస్యంపై ఆరా తీశారు. నిర్ణీత సమయంలోపు భవనాల నిర్మాణాలను పూర్తి చేసి అప్పగించాన్నారు. ఈ తనిఖీల్లో జోనల్, డివిజన్ స్థాయి అధికారులు సీఈ కె.సూర్యనారాయణ, డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, మల్లాడి శ్రీనివాస్, జి.వామనమూర్తి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, మణికంఠ, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నప రెడ్డి, ఎస్ఎస్ఈ మాధవరావు తదితరులు పాల్గొన్నారు. ఈ నెలాఖరుకు జీఎం అరుణ్ కుమార్ జైన్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా అధికారులు ఘనంగా సన్మానించారు.



తిరుపతి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జీఎం అరుణ్ కుమార్ జైన్

కుల ఆధిపత్య రాజకీయాలకు

ప్రత్యామ్నాయంగా ఏఐబీఎస్పీ

● జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు వెల్లడి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): కుల ఆధిపత్య రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా, బహుజనులను అధికారంలోకి తెచ్చేందుకు ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) ఏర్పాటైందని ఆ పార్టీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో రెండు ఆధిపత్య కులాలే రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుంటున్నాయి. బహుజన కులాల్లో చీలికలు తెచ్చి, వారిని తమ వెంట నడిపించుకుంటూ అధికారాన్ని అనుభవిస్తున్నాయి. అందుకని బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రిస్టియన్లను ఏకతాటిమీదకు తీసుకొచ్చి వారికి రాజ్యాధికారమే లక్ష్యంగా ఏఐబీఎస్పీ కృషి చేస్తుంది' అని వివరించారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ పదవులు ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో రెండు కులాల పార్టీలకు రాజకీయసమాధి కట్టి, బహుజన కులాలను అధికారంలో తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏఐబీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి, ఒంగోలు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, విద్యార్థి సంఘం నాయకులు వెంకటస్వామి, బీసీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, ప్రముఖ న్యాయవాది మునయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు



సికిల్ సెల్ అనీమియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

84 వేల మందికి సికిల్ సెల్ అనీమియా పరీక్షలు

తిరుపతి(వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'సికిల్ సెల్ అనీమియా.. వారసత్వంగా వచ్చే వ్యాధి. దీని నివారణకు జిల్లాలో విస్తృతంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికి 84 వేల మందికి పరీక్షలు నిర్వహించగా నెగటివ్ వచ్చింది' అని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ తెలిపారు. ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినం సందర్భంగా గురువారం తిరుపతిలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2047 నాటికి సికిల్ సెల్ అనీమియాను పూర్తిగా తొలగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటికే 1,24,000 మందికి సికిల్ సెల్ అనీమియాకు స్క్రీనింగ్ పరీక్షలు చేయాల్సి ఉండగా.. వీరిలో 84 వేల మందికి పరీక్షలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఓ బాలికను తీసుకెళ్లిన ఘటనలో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలానికి చెందిన ఓ 15 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ప్రభు అనే యువకుడు గత నెల 30వ తేదీన బయటకు తీసుకెళ్లాడు. వెంకటగిరిలోని అతడి బంధువుల ఇంట్లో ఉంచాడు. దీనిపై బాలిక తల్లి తండ్రులు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. పోలీసుల దర్యాప్తులో ఆ బాలికను ప్రభు తీసుకెళ్ళినట్లు తెలిసింది. వెంకటగిరికి వెళ్లి బాలికను తీసుకొచ్చి గురువారం తల్లితండ్రులకు అప్పగించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. త్వరలో అతడిని అరెస్టు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

తాపత్రయం వద్దు.. క్రమశిక్షణతో స్వామిని దర్శించండి

● గణపతి సచ్చిదానంద సూచన



ఆలయంలో గణపతి సచ్చిదానంద

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తాపత్రయ పడకుండా, క్రమశిక్షణతో దర్శించుకోవాలని దత్తపీఠం గణపతి సచ్చిదానంద సూచించారు. తొక్కిసలాటలకు దూరంగా ఉండాలన్నారు. తిరుమల ఆలయ మహద్వారం వద్దకు గురువారం ఉదయం చేరుకున్న సచ్చిదానందకు టీటీడీ అర్చక బృందం, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. అనంతరం మూలమూర్తిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. సాలిగ్రామంగా ఉన్న తిరుమల కొండపై చెప్పులు కూడా వేసుకోకూడదన్నారు. ఒకప్పుడు స్వామి అందరితో మాట్లాడేవారని, క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగిన క్రమంలో ఆయన రాయిగా మారి నిలుచుండి పోయారని పేర్కొన్నారు. స్వామి వద్దకు వచ్చి కష్టం చెప్పుకుంటే ఇట్టే తొలగిపోతాయన్నారు. పైసా హుండీలో వేస్తే పది పైసలు స్వామి ప్రసాదిస్తారన్నారు. టీటీడీ యాజమాన్యం కూడా కానుకలను సమర్థంగా వినియోగిస్తోందని అభినందించారు. ప్రస్తుతం యుద్ధ భయం నెలకొని ఉందని, పరమాత్ముడు ఇచ్చిన భూమిపై ఎందుకు కొట్టుకోవాలని ఆయన ప్రశ్నించారు. శాంతిగా ఉండే బుద్ధిని అందరికీ ప్రసాదించాలని కోరుకున్నట్టు చెప్పారు. తాను ఓ ఆలయాన్ని కడుతున్న క్రమంలో స్వామికి చెప్పి ఆశీస్సులు పొందేందుకు వచ్చానన్నారు. భవిష్యత్తులో అమెరికాలోనూ ఆలయాన్ని నిర్మించబోతున్నట్టు వెల్లడించారు.

రేపు 6వేల మందితో యోగా దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం చిత్తూరులో యోగా కార్యక్రమాన్ని భారీస్థాయిలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పోలీసు పరేడ్ మైదానం లేదా మెసానికల్ గ్రౌండ్‌లో ఆరువేల మందితో ఈ కార్యక్రమం జరగనుంది. వినూత్నరీతిలో గోళాకారంలో ఆరు కంపార్టుమెంట్లుగా విభజించి ఒక్కో కంపార్టుమెంటలో 900 మంది యోగాసనాలు వేసేలా ఏర్పాటు చేస్తున్నారు. అంతకుమించి ఉత్సాహంతో వచ్చే ప్రజలను గ్యాలరీల్లో సర్దుబాటు చేస్తారు. ఇందుకోసం ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరితోపాటు జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు వంటి ప్రజాప్రతినిధులు పాల్గొనాలంటూ ఆహ్వానాలు పంపారు. విశాఖపట్నంలో పీఎం మోదీ యోగా ప్రారంభించే సమయానికి ఇక్కడ ప్రారంభించేలా షెడ్యూలు ఖరారు చేస్తున్నారు.

5,508 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు

జిల్లావ్యాప్తంగా శనివారం 5,508 ప్రాంతాల్లో భారీఎత్తున యోగా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై గురువారం సాయంత్రం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లాస్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగా దినోత్సవ కార్యక్రమాలను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటుచేసుకునేలా పకడ్బందీగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో పేర్లు నమోదు చేసుకున్నవారితో యోగా కార్యక్రమం జరపాలని చెప్పారు. యోగా కార్యక్రమాలు జరిగే ప్రదేశాల వద్ద అన్ని వసతులు కల్పించాలని ఆదేశాలిచ్చారు.

యోగా పోటీల్లో జిల్లాకు రెండు బహుమతులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలు ఈనెల 16 నుంచి 18వ తేదీవరకు విజయవాడలో జరిగాయి. విజేతలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం బహుమతులు అందజేశారు. దీనికి మన జిల్లా నుంచి 11 విభాగాల పోటీల్లో 25 మంది అభ్యర్థులు పాల్గొనగా.. రెండు బహుమతులు వచ్చాయి. సీనియర్స్ యోగా విభాగం క్విజ్ పోటీల్లో కె.కరుణ.. ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. జూనియర్స్ విభాగంలో ఆసనాలు వేయడంలో కుషన్‌కుమార్, నిఖిత, ఎస్.భార్గవ్ రెడ్డి, హర్ష, ప్రీతమ్‌లు బృందంగా తృతీయ బహుమతి పొందారు. విశాఖపట్నంలో శనివారం నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వీరంతా హాజరు కానున్నాయి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుతో కలిసి యోగాసనాలు వేస్తారు.

నెలాఖరులోగా భూపట్టా విభజనకు అవకాశం

● జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పూర్తిచేసిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు వారి భూములను విభజించుకునేందుకు నామమాత్రపు రుసుంతో ఈనెలాఖరులోగా ప్రభుత్వం అవకాశం కల్పించిందని జేసీ విద్యాధరి తెలిపారు. వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదు కాబడిన భూయజమానులు వారి భూముల విభజనకు గతంలో రూ.500 రుసుంగా ప్రభుత్వం నిర్ణయించగా, దానిని పూర్తిగా మినహాయింపు కల్పించి ఉచితంగా ఈసేవ పొందేందుకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఇందుకు కేవలం రూ.50 దరఖాస్తు రుసుం స్థానిక సచివాలయంలో చెల్లించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో ఇబ్బంది ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యం ఇవ్వబడుతుందని సూచించారు.

ఉచిత న్యాయసేవలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి

చిత్తూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఉచిత న్యాయసేవలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి అన్నారు. గురువారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో మానసిక వికలాంగులకు న్యాయపరమైన సేవలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా సమాజంలో వారి పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవచ్చని చెప్పారు. ఉచిత న్యాయసేవలు ఎలా పొందాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవి, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



చంద్రశేఖర్ నాయుడు (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో పాపానివారిపల్లె బస్టాప్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు రూరల్ మండలం కోడిగుంటపల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ నాయుడు, అతడి కుమారుడు యుగేష్ ట్రాక్టర్‌లో మామిడి కాయలను తీసుకొచ్చి బంగారుపాళ్యం మార్కెట్‌లో విక్రయించి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా, బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో కూర్చొని ఉన్న చంద్రశేఖర్ నాయుడు ఎగిరి కిందపడ్డాడు. దీంతో ట్రాక్టర్ ఇంజిన్, ట్రాలీ వేరుకావడంతో ట్రాలీ వచ్చి చంద్రశేఖర్ నాయుడు(62)పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యుగేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు సైకిల్ పంపిణీ



అంజాద్‌కు సైకిల్‌ను అందజేస్తున్న తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్

బంగారుపాళ్యం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త అంజాద్‌బాషాకు సైకిల్ అందజేశారు. అంజాద్ బంగారుపాళ్యం మండలం కేంద్రంలోని జెండామాను వీధికి చెందిన తెలుగుదేశం పార్టీ వీరాభిమాని. ఈయన గత నెల కుప్పం పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చినప్పుడు ఆయన్ను కలిసి సైకిల్ మంజూరు చేయాలని విన్నవించుకున్నారు. అంజాద్‌కు ఓ సైకిల్ ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సీఎం ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ చొరవతో గురువారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ అంజాద్‌కు సైకిల్ అందజేయడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ డీటీ బాబు, వీఆర్వోలు సునీల్‌కుమార్, గోవిందయ్య, విజయ్ ఉన్నారు.

పూతలపట్టులో అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పూతలపట్టు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల కేంద్రంలో అన్నక్యాంటీన్ ఏర్పాటుకు గురువారం తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో నాగరాజుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ సమీపాన నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండును పరిశీలించారు.

టమోటా ధరలు పతనం

తోటల్లో విచ్చలవిడిగా తెగుళ్లు ● ఆందోళనలో రైతులు



టమోటా కాయలపై ఏర్పడుతున్న నల్ల మచ్చలు - టమోటా తోటల్లో ఊజీ ఈగల నివారణకు ఏర్పాటు చేస్తున్న బాక్సులు

సోమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు తగ్గుముఖం పట్టాయి. గురువారం 15 కిలోల బాక్సు కేవలం రూ.130కి చేరింది. నాణ్యత ఉన్న 15 కిలోల టమోటా బాక్సు రూ.150 మాత్రమే పలికింది. మిగిలిన రకాలు రూ.60 నుంచి రూ.70 మాత్రమే అమ్మకాలు జరిగాయి. కర్ణాటక రాష్ట్రంలోని టమోటా మార్కెట్‌లో పరిస్థితి ఇలాగే కొనసాగుతోంది. అనంతపురం జిల్లా నుంచి దిగుబడుల ప్రారంభంతో జిల్లాలోని ప్రముఖ మార్కెట్లలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. వీటికితోడుగా జిల్లాలో కొద్దిపాటి వర్షాలకే టమోటా తోటల్లో విచ్చలవిడిగా చీడపీడలు వ్యాప్తి చెందుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాయలపై మచ్చలు ఏర్పడుతున్నాయి. అలాగే పచ్చగా ఉన్న మొక్కలు వాడుముఖం పడుతున్నాయి. ఈక్రమంలో అధిక మోతాదుల్లో మందులు పిచికారీ చేస్తున్నా అదుపులోకి రావడం లేదు. 10బాక్సుల కాయలు కోస్తే 5 బాక్సుల మేరకు నల్ల మచ్చల కాయలే ఉంటున్నాయి. వీటిని మార్కెట్‌కు తరలిస్తే 15 కిలోల బాక్సు రూ.50 ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైరస్ సోకి దిగుబడులు తగ్గి తోటలే లేకుండా పోయాయని రైతులు ఆందోళన పడుతున్నారు. వేలకు వేలు మందుల పిచికారీ చేసినా ఫలితం లేకపోతోందని రైతులు వాపోతున్నారు. వీటికి తోడు పండు ఈగల (ఊజీ ఈగ) ఉధృతి పెరిగి కాయలు నాణ్యత లేకపోవడంతో ధరలు ఉండటం లేదు. వ్యాపారులు కొనుగోలు చేయలేక పోతున్నారు. ఊజీ ఈగల నివారణకు రైతులు మరింత మందులు పిచికారీ చేయడంతో ఖర్చులు పెరిగిపోతున్నాయి. పెట్టుబడులు రాక ఇబ్బందులు పడుతున్నారు.

కత్తులతో దాడిచేసి మాపైనే నిందలా?

ఇలాగే వ్యవహరిస్తే వైసీపీ ఎమ్మెల్సీ భరత్‌ను కుప్పంలో అడుగుపెట్టనివ్వం ● టీడీపీ శ్రేణుల హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కుప్పం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'అంగన్వాడీ కార్యకర్తపై కత్తులతో వైసీపీ నేత దాడిచేసి.. హత్యాయత్నానికి తెగబడిందే కాక, మళ్లీ మాపైనే నిందలు వేయడం దారుణం' అని కుప్పం మండలానికి చెందిన టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. అలాగే హైదరాబాదులో కూర్చొని.. ఇక్కడి కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం మానుకోకుంటే వైసీపీ ఎమ్మెల్సీ భరత్‌ను కుప్పంలో అడుగుపెట్టనివ్వమని హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలానికి చెందిన కొందరు పార్టీ నాయకులతోపాటు, రాగిమానుమిట్ట గ్రామస్తులు మీడియాతో మాట్లాడారు. వైసీపీకి చెందిన మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అక్తర్‌యే తనమీద కత్తులతో దాడి చేసినట్లు బాధితురాలైన అంగన్వాడీ కార్యకర్త నజ్మా స్వయంగా చెప్పిందన్నారు. అయితే ఇదంతా చేయించింది టీడీపీ మండల అధ్యక్షుడేనంటూ అక్తర్.. సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేయడాన్ని ఖండించారు. వైసీపీ హయాంలో అప్పటి పాలకులు, నాయకులు తమపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టి వేధించినా, వాటన్నింటిని మరిచిపోయి, శాంతి సామరస్యాలతో కుప్పం ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో అభివృద్ధిపైనే దృష్టి పెట్టామన్నారు. కానీ వైసీపీ ఎమ్మెల్సీ భరత్ మాత్రం కులాలు, మతాలను రెచ్చగొట్టి.. రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ వచ్చాక రాగిమానుమిట్టలో అక్తర్.. అరాచకాలు, దాడులు అధికమైపోయాయన్నారు. నాలుగైదు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆయనపై రౌడీషీట్ కూడా ఉన్నదని చెప్పారు. వెంటనే అతడిని అరెస్టు చేసి.. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, మైనారిటీ సెల్ మండల నాయకుడు హైదర్ వలి, స్థానిక యూనిట్ ఇన్‌చార్జి శివకుమార్, కుప్పం మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు వసంతమ్మ, తెలుగు యువత కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి మణి, కంగుంది సర్పంచి ధనశేఖర్, నాయకులు అశోక్, జేకే సంతోశ్, బాధితురాలు నజ్మా భర్త అంజత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారు తాకట్టు పెట్టిన కేసులో ఐదుగురి అరెస్టు

పలమనేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని ఓ ప్రైవేటు బ్యాంకులో గత మార్చి నెలలో నకిలీ బంగారు తాకట్టు పెట్టిన కేసులో గురువారం ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ నరసింహరాజు తెలిపారు. బ్యాంకు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అప్పట్లో 8మందిని అరెస్టు చేయగా దర్యాప్తులో మరో ఐదుగురు శంకరయ్య, బోస్‌రెడ్డి, గణేష్, నరేష్‌కుమార్, ప్రకాష్‌ల ప్రమేయం ఉందని గుర్తించారు. వీరిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్



క్లినిక్‌కు తాళం వేస్తున్న రాళ్లబూదుగూరు డాక్టర్ శివకుమారి

శాంతిపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల పరిధిలోని కనమలదొడ్డిలో నిర్వహిస్తున్న ఆర్ఎంపీ క్లినిక్‌ను రాళ్లబూదుగూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొంతకాలంగా శింగారువేలు అనే వ్యక్తి ఈ క్లినిక్ నిర్వహిస్తున్నాడు. 25 రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన వేలు అతని వద్ద వైద్యం చేసుకోవడంతో మృతి చెందాడని బంధువులు వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు, ఆర్ఎంపీగా ఎలాంటి అర్హతలు లేకపోవడంతో మందలించి సీజ్ చేశారు. కార్యక్రమంలో రాళ్లబూదుగూరు ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానముంటే వేలి ముద్ర వేయాల్సిందే

● గత నెలలో 1650 మంది నుంచి సేకరించిన పోలీసులు

● నిందితుల గుర్తింపులో కీలకంగా ఫాఫిలాన్, లైవ్ స్కానర్లు



ఫాపిలాన్



లైవ్ స్కానర్ ద్వారా వేలిముద్రల సేకరణ.. పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

ఎవరైనా అనుమానాస్పద స్థితిలో కనిపించారంటే చాలు.. పోలీసులు వారి వేలి ముద్రలు సేకరిస్తున్నారు. అలాగే, ఫాఫిలాన్, లైవ్ స్కానర్ల ద్వారా వేలి ముద్ర వేయగానే ఆ వ్యక్తులకు నేరచరిత్ర ఉంటే తెలిసిపోతుంది. ఇక, నేరఘటనల్లో వేలిముద్రలను ట్యాలీ చేసి నిందితులను పట్టుకునేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. ఇటీవల మధ్యప్రదేశ్ గ్యాంగ్‌ను తిరుపతి పోలీసులు ఇలాగే పట్టుకున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేరగాళ్లు పోలీసులను ఏమార్చేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మరోవైపు పోలీసులూ వారిని పట్టుకునేందుకు.. భవిష్యత్తులో దొంగతనాలకు పాల్పడినా గుర్తించేలా సాంకేతికతను అంది పుచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న ఫాపిలాన్, లైవ్ స్కానర్ల ద్వారా వేలి ముద్రలు, అరచేతి ముద్రలు సేకరిస్తున్నారు. ఈ వివరాలు నేరగాళ్లను గుర్తించడంలో పోలీసులకు సహాయ పడుతున్నాయి. గతంలో వేలి ముద్రలు సేకరించే పనులు చాలా మందకొడిగా సాగేవి. ఇటీవల నేరాలు పెరగడం, గంజాయి, బహిరంగంగా మద్యం తాగడం, మహిళలు, వేధింపులు, చిన్నారులపై అఘాయిత్యాలు, ఇంటి దొంగతనాలు, దోపిడీలు, ద్విచక్ర వాహనాల చోరీ, బస్టాండు, రైల్వే స్టేషన్‌లో చైన్ స్నాచింగ్‌లు, పిక్‌ప్యాకెట్లు పెరిగాయి. ఫాఫిలాన్‌తో పాటు లైవ్ స్కానర్లను వినియోగించి ఈ ఘటనల్లో నిందితులను గుర్తించే పనులు చేపట్టారు. అదే సమయంలో అనుమానితుల వేలి ముద్రలు సేకరించే పనులూ సాగుతున్నాయి. గత నెలలో దాదాపు 1650 మంది వేలి ముద్రలు సేకరించారు. ఇలా వేలి ముద్రల సేకరణలో రాష్ట్రంలోనే తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఎస్పీ హర్షవర్ధన్‌కు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అభినందనలు తెలుపుతూ కీపిటప్ అని ప్రశంసించారు.

● ఇటీవల తిరుచానూరు, తిరుపతి ఈస్ట్ పరిధిలో జరిగిన మారుతీ షోరూముల్లో దోపిడీ ఘటనల్లో వేలి ముద్రల ఆధారంగానే మధ్యప్రదేశ్ గ్యాంగ్‌ను పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు.

● తిరుపతిలోని విష్ణునివాసంలో రోజూ 20 నుంచి 30 మొబైల్ ఫోన్లు, బంగారు నగలు, విలువైన వస్తువులు చోరీకి గురయ్యేవి. బాధితులు ఫిర్యాదు ఇవ్వడం తప్ప న్యాయం జరిగిన ఘటనలు చాలా తక్కువ. ఈ క్రమంలో విష్ణునివాసంలో లైవ్ స్కానర్ ఏర్పాటు చేసి అనుమానితులు, పాత నేరస్థుల వేలి ముద్రలు సేకరించే పనులు చేపట్టారు. ఇలా విష్ణునివాసం, శ్రీనివాసం వద్ద వారం కిందట 15 మందిని ఒకసారి, ఐదుగురిని మరోసారి గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 20 సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. దీంతో అక్కడ దొంగతనాలు తగ్గు ముఖం పట్టాయి.

జిల్లాలో 13,187 సీసీ కెమెరాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా బ్లాక్ స్పాట్స్, ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, మారుమూల పల్లెలు, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నాలుగు నెలలుగా దాదాపు 13,187 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా గరుడ ఫ్లైఓవర్‌పై ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరిగి పోవడం, ఆకతాయిల ఆగడాలు ఎక్కువ కావడం, అర్ధరాత్రి పూట మత్తు పదార్థాల వినియోగం పెరగడంతో ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. త్వరలో ఇంకా కీలకమైన ప్రదేశాల్లో అమర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రైల్వే స్టేషన్, బస్టాండులోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో భిక్షగాళ్ల సందడి, నేరస్థుల కదలికలు తగ్గుముఖం పట్టాయి. విష్ణునివాసంలో బంగారం ఉండే బ్యాగు తీసుకెళ్తుంటే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకున్నారు.

కూటమిలో కోవర్టులు!

తిరుపతి నగరపాలక కౌన్సిల్ సమావేశంలో బట్టబయలు ● ఆలోచనలో పడ్డ నేతలు

తిరుపతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎన్డీఏ కూటమిలో కోవర్టుల భయం పట్టుకుంది. నగరపాలక సంస్థకు చెందిన ఓ స్థలాన్ని విక్రయించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై జరిగిన కౌన్సిల్ సమావేశంలో కొందరు కార్పొరేటర్ల వ్యవహారశైలి తీవ్ర చర్చకు దారితీసింది. వైసీపీ కండువా తీసి కూటమి కండువాలు కప్పుకున్నారు గానీ గత పార్టీ భావజాలం మాత్రం అలాగే ఉందనే వాదన కౌన్సిల్ సమావేశంలో స్పష్టమైంది. అధికార పార్టీతో ఉంటే అన్ని పనులు చక్కబెట్టుకోవచ్చనే స్వార్థంతోనే కండువాలు వేసుకుని కొందరు, వేసుకోకుండా మరికొందరు తిరుగుతున్నారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. కార్పొరేషన్ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు కూటమి మద్దతు కార్పొరేటర్లు ప్రతిపక్ష పార్టీ నిర్ణయానికి అనుకూలంగా కనిపించి కూటమి నేతలకు షాక్ ఇచ్చారు. సాక్షాత్తు కౌన్సిల్ ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఎదుటే కూటమి నిర్ణయానికి అడ్డుతగలడం ఆశ్చర్యానికి గురిచేసింది. సమావేశం అనంతరం ఎమ్మెల్యే కూడా కార్పొరేటర్ల వ్యవహారశైలిపై నాయకుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. కౌన్సిల్ సమావేశానికి ముందురోజే తిరుపతిని అమ్మేస్తున్నారంటూ కూటమి ప్రభుత్వ పెద్దలను తిట్టిపోస్తూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే డిప్యూటీ మేయర్లు, కూటమిలోని మహిళా కార్పొరేటర్లు మినహా గట్టిగా గొంతెత్తి ఖండించాల్సిన సీనియర్ కార్పొరేటర్లు మాత్రం సెటైర్లు వేసుకోవడం ఎమ్మెల్యేని నివ్వెరపరిచింది. అయినప్పటికీ కౌన్సిల్ సమావేశం అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడే సమయంలోనూ వైసీపీని ఖండించని కార్పొరేటర్లనే పక్కన పెట్టుకున్నారు. కూటమిలో విలువ, స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ కొందరు ఇంకా వైసీపీ బంధం నుంచి బయటపడకపోవడంలేదన్న అనుమానాలు బలపడుతున్నాయి. వైసీపీ నేతల కనుసన్నల్లోనే సదరు కార్పొరేటర్లు పనిచేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కూటమిలో కోవర్టులను పెట్టుకుని రాజకీయాలు ఎలా చేయాలంటూ నాయకులు మదనపడుతున్నారు. ఇకనైనా ఇలాటివారిపట్ల అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నారు.

వారి సభ్యత్వాన్ని రద్దు చేయండి

మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన చాణక్య హోటల్ విక్రయానికి అనుకూలంగా ఓటేసిన వైసీపీ కార్పొరేటర్ల సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆపార్టీకి చెందిన మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు గురువారం కమిషనర్ మౌర్యకు వినతిపత్రం అందజేశారు. కౌన్సిల్ సమావేశానికి ముందు తమ పార్టీ కార్పొరేటర్లకు విప్ జారీ చేసినా కొందరు ధిక్కరించి కూటమికి అనుకూలంగా మాట్లాడారన్నారు. కమిషనర్‌ను కలిసినవారిలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఉమా అజయ, ఆరణి సంధ్య, అమరనాథ్ రెడ్డి, అనిల్ తదితరులు ఉన్నారు.

'కొండ'పై భక్తులకు మరిన్ని ఉచిత బస్సులు

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులను ట్యాక్సీ దోపిడీ నుంచి రక్షించేలా మరిన్ని ఉచిత బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. తిరుమలలో ప్రస్తుతం 10 శ్రీవారి ధర్మరథాలు(ఉచిత బస్సులు) అందుబాటులో ఉన్నాయి. ఇవి తిరుమలలోనే ఉంటూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరవేస్తుంటాయి. ఇటీవల తిరుమలలోని ట్యాక్సీలు భక్తులను నుంచి అధిక మొత్తం ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులున్న క్రమంలో టీటీడీ ఓ నూతన ఆలోచన చేసింది. తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే ఆర్టీసీ బస్సులను కూడా ఫ్రీ సర్వీసుకు వినియోగించాలని నిర్ణయించింది. దీనికి ఆర్టీసీ అధికారులు అంగీకారం తెలపడంతో తొలిదశలో గురువారం 80 ఆర్టీసీ బస్సులను ఉచిత రవాణాకు అందుబాటులోకి తీసుకొచ్చారు. భక్తులకు ట్యాక్సీల ఛార్జీల భారం తగ్గించడంతో పాటు తిరుమలలో పర్యావరణ పరిరక్షణ, వాహన శబ్ద కాలుష్య నివారణకు ఈ విధానం ఉపయోగంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఆర్టీసీలో ఉచిత ట్రిప్పులను గురువారం ప్రారంభించి.. ఆ బస్సులో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్, టీటీడీ రవాణా జీఎం శేషారెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటరావు, డిప్యూటీ సీఎంఈ బాలాజీ, డిపో మేనేజర్ శ్రీహరి తదితరులు కొంతదూరం ప్రయాణించారు.

ఏయే ప్రాంతాల్లో తిరుగుతాయంటే..

తిరుపతి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు తొలుత తిరుమలలోని బాలాజీ బస్టాండ్‌కు చేరుకుంటాయి. అక్కడ ప్రయాణికులు దిగాక.. అదే బస్సు శ్రీవారి ధర్మరథాలు తిరిగే రూట్‌లోకి ప్రవేశిస్తుంది. శంఖుమిట్ట(ఎస్ఎంసీ), వైకుంఠం 1, ఎస్వీ గెస్ట్‌హౌస్, కృష్ణతేజ సర్కిల్, వైకుంఠం 2, ఎస్వీ మ్యూజియం, మఠాలు, వరాహస్వామి విశ్రాంతి గృహాలు, నందకం, రాంభగీచ, లేపాక్షి సర్కిల్, సీఆర్వో కార్యాలయం మీదుగా తిరిగి జీఎన్సీ టోల్‌గేట్‌కు చేరుకుంటుంది. తిరుపతి నుంచి వచ్చే భక్తులు ఈ ప్రాంతాల్లో ఎక్కడైనా దిగచ్చు. ఈ ప్రాంతాల్లో ఎక్కే ప్రయాణికులు జీఎన్సీ టోల్‌గేట్ వరకు తమకు కావాల్సిన ప్రాంతాల్లో దిగచ్చు. జీఎన్సీ తర్వాత తిరుపతి వెళ్లే భక్తులు మాత్రమే టికెట్ కొనాలి. తిరుపతికి వెళ్లే భక్తులకు వరాహస్వామి విశ్రాంతి గృహాల వద్ద టికెట్లు విక్రయించే కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. అవసరానికి అనుగుణంగా ఈ బస్సుల సంఖ్యను 150 వరకు పెంచాలని అధికారులు భావిస్తున్నారు.

హైరోడ్డు విస్తరణలో కీలక ముందడుగు

● చిత్తూరులోని కట్టమంచి ప్రాంతంలో వంద అడుగుల సేకరణ



వెంకుసా కల్యాణ మండపం వద్ద ప్రహరీని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న సిబ్బంది

చిత్తూరు అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని హైరోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం కీలక ముందడుగు పడింది. ప్రైవేటు యజమానులను ఒప్పించి వంద అడుగుల మేర రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని సేకరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కమిషనర్ నరసింహప్రసాద్‌ల ఆదేశాలతో హైరోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏసీపీ నాగేంద్ర ఆధ్వర్యంలో ప్రణాళిక విభాగం అధికారులు గురువారం కట్టమంచి ప్రాంతంలో వెంకుసా కల్యాణ మండపం వద్ద వంద అడుగుల రోడ్డు వెడల్పు చేయడానికి అవసరమైన స్థలాన్ని సుమారు 200 అడుగుల పొడవుతో సేకరించారు. ఈ మేరకు ప్రహరీని తొలగించి రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సేకరించారు. ఇక్కడే మరికొన్ని ప్రైవేటు స్థలాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించారు.

పశువుల దాణా పంపిణీ



పాడి రైతులకు దాణా అందజేస్తున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆరీఫ్

బంగారుపాళ్యం, జూన్19 (ఆంధ్రజ్యోతి): రాయితీపై ప్రభుత్వం అందించే పశువుల దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆరీఫ్ అన్నారు. గురువారం మండలంలోని కాటప్పగారిపల్లె 50 శాతం రాయితీపై అందిస్తున్న పశువుల దాణాను ఆయన పాడి రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో 40 టన్నులు పంపిణీ చేయగా, రెండో విడతలో 38 టన్నులు వచ్చాయని, ఇవి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆసీఫ్, సిబ్బంది పావని, రైతులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కార్డుదారులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఇన్బనాథన్

పలమనేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : చౌకదుకాణ డీలర్లు కార్డుదారులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని పలమనేరు తహసీల్దార్ ఇన్బనాథన్ హెచ్చరించారు. గురువారం మండలంలోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. చౌకదుకాణాలను నిర్దేశించిన స్థలంలోనే నిర్వహించాలని సూచించారు. ప్రతి దుకాణం వద్ద ధరల వివరాలు, స్టాకు వివరాలు ఉన్న బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్డుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన పనివేళల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో డీలర్ల సంఘ నాయకులు నరేంద్ర, విశ్వనాథరెడ్డి, సనావుల్లా, లియాఖత్, మునికృష్ణయ్య, జుబేద్, జిలాని, యువరాజు, గోవిందు, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సోమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మపల్లెలో కొలువుదీరిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా హోమాలు చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి ఆలయ చిన్న శేషవాహనంపై ఉత్సవర్లను పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

సోమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సోమల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు పుంగనూరు బాలికల కళాశాలకు బదిలీపై వెళ్లడంతో ఆయన్ను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత పెంచడానికి తోటి అధ్యాపకులు ఎంతో సహకరించారని, విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోటీశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి గౌతం, అధ్యాపకులు శివయ్య, వెంకటరమణ, రామకృష్ణ, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఎలుకల బెడద



ప్రింటర్‌లో చేరిన ఎలుక

గంగవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గంగవరం-1 సచివాలయంలో ఎలుకలు దూరి ప్రింటర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. గత రెండు రోజుల క్రితం ప్రింటర్‌లో ఎలుకలు ప్రవేశించి ప్రింటర్ మొరాయించడంతో ఇంటిపన్నులు, నీటిపన్నులతో పాటు పలుసేవలకు సచివాయానికి వచ్చే ప్రజలకు వాట్సప్ మెసేజ్‌తోనే సిబ్బంది సరిపెడుతూ వస్తున్నారు. ప్రింటర్ మరమ్మతుకు సంబంధిత కంపెనీ వారికి సమాచారం ఇచ్చామని.. త్వరలోనే బాగు చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు పితృవియోగం

కుప్పం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు పితృ వియోగం కలిగింది. ఎమ్మెల్సీ తండ్రి కంచర్ల రామయ్య, హైదరాబాదులోని కిమ్స్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. కంచర్ల శ్రీకాంత్‌కు కలిగిన పితృవియోగంపై కుప్పం నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీ తండ్రికి ఆత్మశాంతి కలగాలని ప్రార్థించారు.

నేటి నుంచి సల్లాపురెమ్మ, గంగమాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు

శాంతిపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శాంతిపురంలో శుక్రవారం నుంచి మూడు రోజులు సల్లా పురెమ్మ, రాళ్లగంగమాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నట్లు ఆలయాల ధర్మకర్తలు తెలిపారు. శుక్రవారం గణపతి పూజ, ధ్వజారోహణం, అంకురార్పణ కార్యక్రమాలు జరుగుతాయని.. సాయంత్రం అమ్మవార్ల కల్యాణోత్సవం, రాత్రి ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. శనివారం రాళ్లగంగమాంబ, సల్లాపురెమ్మ, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. రాత్రి అగ్ని గుండ ప్రవేశం, నయ్యాండి, పుష్పపల్లకి కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళులు

రొంపిచెర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల పంచాయతీ బజారువీధికి చెందిన టీడీపీ నాయకుడు ఓబులంపల్లె పట్టాభి చిత్ర పటానికి గురువారం పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ డాక్టరు లక్ష్మీనారాయణ, సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, టీడీపీ నాయకులు సురేంద్రబాబు, శ్రీనివాసులు, తులసీరాం, షేక్ కరీముల్లా, ఇమ్రాన్‌ఖాన్, రామమూర్తి, రాధాకృష్ణ, హయత్‌బాషా పలువురు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు



ప్లాస్టిక్ గ్లాసులు స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పలమనేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో గురువారం మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది పలు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, విక్రయిస్తున్న దుకాణదారులకు జరిమానాలు విధించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు విద్యాకిట్ల పంపిణీ



విదార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఆనిగానూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లను గురువారం అందించారు. వైస్‌ఎంపీపీ వెక్రమగౌడు, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి , మహదేవి, టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ సుభాష్, నేతలు బీరప్ప, షణ్ముగం, మునేగౌడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పరిసరాల శుభ్రతతోనే అతిసార దూరం



అవగాహన ర్యాలీలో వైద్యాధికారులు, సిబ్బంది

రామకుప్పం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే అతిసారా బారి నుంచి కాపాడుకోవచ్చని విజలాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి పూజిత తెలిపారు. గురువారం విజలాపురంలో అతిసారపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలన్నారు. శిశువులకు ఆరునెలల వరకు తప్పనిసరిగా తల్లి పాలు తాగించాలని సూచించారు. సురక్షితమైన, పరిశుభ్రమైన తాగునీరును వినియోగించాలని కోరారు. హెల్త్ అసిస్టెంట్ బాలు, ఎల్‌టీ ప్రభావతి, స్టాఫ్‌నర్సు రోజారమణి, పలువురు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపంజాణి ఏవోగా హేమలత



పెద్దపంజాణి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండల వ్యవసాయాధికారిణిగా హేమలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రఫీబా బదిలీపై గంగవరం వెళ్లారు. గంగవరంలో విధులు నిర్వహిస్తున్న హేమలత పెద్ద పంజాణికి ఎంఏవోగా వచ్చారు.

పుంగనూరు ఇరిగేషన్ ఏఈగా దీప



పుంగనూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఇరిగేషన్ ఏఈగా దీప గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏఈగా పనిచేస్తున్న బాబు రాజేంద్రప్రసాద్ అన్నమయ్య జిల్లా మదనపల్లె డివిజన్‌కు బదిలీ కావడంతో పలమనేరు డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఈ దీప బదిలీపై పుంగనూరుకు బదిలీపై వచ్చారు.

రేపు రైతుల సత్యాగ్రహం

పలమనేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను ఆదుకోవడంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, ఈనెల 21న శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్లు మామిడి రైతుల సంక్షేమ సంఘ కన్వీనర్లు టి.జనార్ధన్, ఎస్.ఆనందనాయుడు, ఉమాపతినాయుడు పేర్కొన్నారు. గురువారం మునీశ్వరరెడ్డి అధ్యక్షతన మామిడి రైతుల సంక్షేమ సంఘ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంజీవ రెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

చల్లా రామచంద్రారెడ్డి



ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలనేదే ప్రభుత్వ ధ్యేయమని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కోసం మెప్మా రీసోర్స్ పర్సన్లకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి మొట్టమొదటగా మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారికి వడ్డీలేని రుణాలకు అందించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇంట్లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే ఆ కుటుంబం అన్నివిధాలా బాగుంటుందని తెలిపారు. ఆర్పీలు సంఘాలకు జవాబుదారితనంగా ఉంటూ వారిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఎం.శ్రీకాంత్, సీవీరెడ్డి, పోలీసుగిరి, సుబ్రహ్మణ్యంరాజు, సుహేల్‌బాషా, రామకృష్ణమరాజు, దేశాధి ప్రకాశ్, పగడాల రమణ, ప్రసాద్ స్వామి, సుబ్రహ్మణ్యం, రమణ, గంగాధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాల సాయం

పుంగనూరు: ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా సూపర్‌సిక్స్ పథకాల్లో నాలుగింటిని సీఎం చంద్రబాబునాయుడు అమలు చేశారని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో ఏడాదిలోను నాలుగు పథకాలు అమలు చేయడం సంతోషకమన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారని దుయ్యబట్టారు. ఈ నెలలోనే రైతుల కళ్లల్లో సంతోషం చూడటానికి రైతు భరోసా అమలవుతుందని.. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం ప్రారంభమవుతుందని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో తల్లికి వందనం అమలు కావడంతో తల్లుల్లో సంతోషం కనిపిస్తోందని తెలిపారు. చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప సీఎం చంద్రబాబునాయుడును అసభ్యకరంగా మాట్లాడటం తగదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీకాంత్, సుహేల్‌బాషా, రామకృష్ణమరాజు, సీవీరెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు ప్రభుత్వం అండ



బైరెడ్డిపల్లెలో సమావేశమైన అధికారులు, రైతులు

కల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చివరి మామిడి కోతలు చేపట్టే వరకు ప్రభుత్వం అండగా మామిడి రైతులకు అండగా ఉంటుందని.. తోతాపురి మామిడికి ధరలు తగ్గుముఖం పట్టాయని రైతులు ఎలాంటి ఆందోళన చెందకండని తహసీల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు, మంగళంపేట ర్యాంపులను గురువారం ఆయనతోపాటు ఎంపీడీవో రాజశేఖర్ తనిఖీలు చేశారు. అనంతరం మంగళంపేటలో మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నెల చివరి వరకు కోతలు చేపట్టే తోతాపురి మామిడికి కిలోకు రూ.4 తప్పక చెల్లిస్తుందన్నారు. ధరలు తగ్గుముఖం పడుతున్నాయనే ఆందోళనతో పక్వానికి రాకముందు కోతలు చేపట్టరాదని సూచించారు. విడతలు వారీగా మామిడి కోతలు చేపడితే గుజ్జు పరిశ్రమలు, ర్యాంపులు, వ్యాపారులపై ఒత్తిడి తగ్గుతుందని, ధరలు ఆశాజనకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

● **సోమల:** మామిడి రైతులు పక్వానికి వచ్చిన తోతాపురి కాయలనే మార్కెట్‌కు తరలించాలని తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో నారాయణ సూచించారు. గురువారం సోమల, పొదలకుంటపల్లె, నంజంపేట సచివాలయాల్లో మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుబుక్తుల్లా, ఉద్యానశాఖ మంజునాథ, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** మండలంలోని శెట్టిపల్లె, కమ్మనపల్లె గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ మామిడి రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్‌యార్డుల వద్ద రైతులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఏవో గీతాకుమారి, నాయకులు రఘుచంద్రగుప్తా, రైతులు పాల్గొన్నారు.

● పెద్దపంజాణి: మండలంలోని ముత్తుకూరులో మామిడి రైతులతో అధికారులు సమావేశమై అవగాహన కల్పించారు. ఎంపీడీవో బాలాజీ, ఎంఏవో హేమలత, రైతులు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: తోతాపురి మామిడి పంట కలిగిన రైతులు పక్వానికి వచ్చిన కాయలు మాత్రమే విక్రయానికి తరలించాలని ఉద్యాన శాఖాధికారి సంతోషికుమారి సూచించారు. గురువారం బండకిందపల్లె సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి



నిరసనలో మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు

పుంగనూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులు గురువారం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి విన్నవించారు. నాలుగో రోజు రిలేదీక్షలు చేస్తూ ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు శ్రీరాములు మాట్లాడుతూ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి మాత్రమే దీక్షలు చేస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.29 వేలు ఇవ్వాలని, నాన్ టెక్నికల్ వారికి రూ. 24,500 ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులకు పెంచిన విధంగా ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న వారికి జీతాలు పెంచాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా సంక్షేమ పథకాలు అందివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘనాయకులు కుమార్, సుదర్శన్‌రాజు, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు, గోపి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గత 11 ఏళ్ల బీజేపీ ప్రభుత్వ పథకాలు, పరిపాలనపై ప్రచారం చేస్తున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్‌రాజు తెలిపారు. గురువారం స్థానిక మేలుపట్ల, భగత్‌సింగ్‌కాలనీ తదితర ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ముద్రించిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందేలా కేంద్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లికారాణి, పెద్దమఠంబాబు, మనోహర్, నానబాలకుమార్, వెంకటరెడ్డి, నాగరాజు, మంజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లీలామాధవి

పుంగనూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో లీలామాధవి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శనివారం జరిగే యోగా దినోత్సవాన్ని ప్రతి పంచాయతీ కేంద్రంలో నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● **కల్లూరు:** రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21న నిర్వహిస్తున్న యోగా డేలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో రాజశేఖర్ తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం అన్ని శాఖల అధికారలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య, ఏపీవో సౌభాగ్యవతి, ఏపీఎం చంద్రమోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 12 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రహమతుల్లాఖాన్

చౌడేపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి శస్త్రచికిత్సలకు 12 మంది ఎంపికైనట్లు డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ రహమతుల్లాఖాన్ ఆధ్వర్యంలో 35 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమలో ఎంఎన్ హాస్పిటల్ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతమాకులపల్లె టీడీపీ అధ్యక్షుడిగా షావలి



29ఏ చింతమాకులపల్లెలో పర్యటిస్తున్న టీడీపీ నాయకులు

చౌడేపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 29ఏ చింతమాకులపల్లెలో టీడీపీ గ్రామ కమిటీని ఏర్పాటు చేసినట్లు టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని 29ఏ చింతమాకులపల్లె పంచాయతీ అధ్యక్షులుగా షావలి, ఉపాధ్యక్షులుగా రెడ్డెప్పరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాబునాయుడు, చిన్నకిశోర్, చంద్రమౌళి, మహ్మద్‌గని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

పుంగనూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు శ్రీచైతన్య టెక్నో పాఠశాల యాజమాన్యం విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని, అధికారులు పాఠశాలను సీజ్ చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పాఠశాల ఎదుట ధర్నా చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మున్నా, గోపీచంద్, గిరిధర్, హుసేన్, శేఖర్, అఖీల్ తదితరులు పాల్గొన్నారు.

అనీమియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ



అనీమియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేపడుతున్న వైద్యసిబ్బంది

గంగవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అనీమియా నిర్మూలనపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. గురువారం గంగవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది అనీమియా నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు, సీహెచ్‌వో మనోరమాదేవి, సూపర్వైజర్ జ్యోతీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● **చిత్తూరు:** 0-40 ఏళ్ల లోపు ఉన్న ఆదివాసీలందరూ తప్పకుండా రక్తపరీక్షలు చేయించుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ అన్నారు. గురువారం సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా స్థానిక గాయత్రీనగర్‌లో ఉన్న గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి ఆదివాసీల్లో ఎక్కువగా వస్తుందన్నారు. ఈ వ్యాధి ఉన్న తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందన్నారు. వ్యాధి సోకిన వారు 50 ఏళ్ల లోపే మరణిస్తున్నారని, ముందుగా గుర్తిస్తే మందుల ద్వారా జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రేఖ, వైద్యాధికారి దయాసాగర్ పాల్గొన్నారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6 నుంచి 9వ తరగతి వరకున్న మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాయుడుపేట, చిల్లకూరు, కోట, వాకాడులోని బాలుర పాఠశాలలు.. పుదూరు, సూళ్ళూరుపేట, డక్కిలి, సత్యవేడు, శ్రీకాళహస్తి, పుత్తూరులోని బాలికల పాఠశాలల్లో మిగులు సీట్లకు ఆయా విద్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 25న శ్రీకాళహస్తిలోని బాలికల పాఠశాలలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఉన్నతాధికారులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. వీరిలో విభిన్న ప్రతిభాంతులు, వృద్ధుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్, ఆర్కియాలజీ, మ్యూజియం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రజిత ఉన్నారు.





కలెక్టర్‌ను కలిసిన వినోద్, రజిత ←


శ్రీహరి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,440

తలనీలాలు సమర్పించినవారు: 33,687



ఉగ్రవాదులను ఎదుర్కొంటాం





● తిరుమలలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

అతిథిగృహం ముందు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బంది



తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వీవీఐపీలు బస చేసే పద్మావతి అతిథిగృహంలో బుధవారం అర్ధరాత్రి ఆక్టోపస్ మాక్‌డ్రిల్ జరిగింది. దేశసరిహద్దుల్లో గతంలో నెలకొన్న యుద్ధపరిస్థితుల నేపథ్యంలో తిరుమల, తిరుపతిలో ఆక్టోపస్, పోలీసులు వరుసగా మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే పద్మావతి అతిథి గృహంలోనూ మాక్‌డ్రిల్ నిర్వహించారు.

మాక్ డ్రిల్ సాగిందిలా..

పద్మావతి అతిథిగృహంలో ఉగ్రవాదులు ప్రవేశించారని బుధవారం రాత్రి 9.20 గంటలకు తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ఆక్టోపస్ కమాండ్ కంట్రోల్‌కు సమాచారాన్ని చేరవేశారు. స్పందించిన ఆక్టోపస్ అధికారులు, వివిధ విభాగాల సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. అత్యంత స్పష్టమైన ప్రణాళికతో మాక్ ఆపరేషన్‌ను ప్రారంభించారు. ప్రణాళిక ప్రకారం ఆక్టోపస్ సిబ్బంది ఆయుధాలతో అతిథిగృహం వద్దకు చేరుకుని ఓ అగంతకుడిని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు ఉగ్రవాదులను హతమార్చారు. గాయపడిని ఓ సెక్యూరిటీ గార్డును ఆస్పత్రికి తరలించారు. అనుకున్న విధంగానే ఆపరేషన్‌ను ఐదుగంటల్లో పూర్తిచేసి మాక్ డ్రిల్‌ను ముగించారు. ఈ ఆపరేషన్‌లో ఆక్టోపస్‌తో పాటు స్థానిక పోలీసులు, రిజర్వ్ పోలీసులు, టీటీడీ విజిలెన్స్, బాంబ్ స్క్వాడ్, ఫైర్ టీం, మెడికల్ విభాగాలు పాల్గొన్నాయి.



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

శాఖల వారీగా భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ

● టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడి

తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు టీటీడీలో అందిస్తున్న సేవలపై క్రమం తప్పకుండా అభిప్రాయ సేకరణ జరిపి, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు భక్తుల నుంచి సేకరించిన ఫీడ్‌బ్యాక్‌పై చర్చించారు. శ్రీవారి దర్శనం, అన్నప్రసాదాలు, వడ పంపిణీ, వసతి, కాలినడక భక్తులకు అందజేస్తున్న సేవలు, లగేజీ, కల్యాణకట్ట, వైద్యం, పారిశుద్ధ్యం, విజిలెన్స్, ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలపై భక్తుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నామని, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వెంగమాంబ అన్నప్రసాద భవనంలో పెరిగిన రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు హాళ్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. అన్నప్రసాదాల పంపిణీలో ఆలస్యం చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. బియ్యం, ముడిసరుకుల నాణ్యతను పరీక్షించేందుకు ఆధునిక పరికరాలను ఉపయోగించి మరింత రుచికరమైన అన్నప్రసాదాలను అందించాలన్నారు. వసతి గృహాల్లో సకాలంలో పరిశుభ్రతా ప్రమాణాలను పాటించేందుకు వీలుగా రిసెప్షన్, ఐటీ విభాగాలు సమన్వయంతో ఎఫ్ఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రద్దీ సమయాల్లో లడ్డూ కౌంటర్ వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా పంపిణీ జరగాలన్నారు. రద్దీకి తగినట్టు సిబ్బందిని పెంచాలన్నారు. ట్రాన్స్‌పోర్టు, కల్యాణకట్టల్లోని భక్తుల వసతులపై అధిక శ్రద్ధ వహించాలన్నారు. తిరుమలలో వసతి బస్సుల సదుపాయ సమాచారాన్ని మైకుల ద్వారా ప్రకటనలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి(వర్చువల్), జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం కొరవడింది

● మండల సమావేశంలో నగరి ఎంపీపీ, ప్రజాప్రతినిధుల నిరసన



మండల సమావేశంలో నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

నగరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం కొరవడిందంటూ ఎంపీపీ భార్గవి, జడ్పీటీసీ గాంధీ, ఎంపీటీసీలు, సర్పంచులు నగరి మండల సర్వసభ్య సమావేశంలో కింద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. గురువారం నగరి ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాదిగా మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, అధికారులు ఎంపీపీ మాట వినడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ భార్గవి మాట్లాడుతూ మండలంలో ఏపని జరిగినా తమకు చెప్పడం లేదని, కనీసం కొత్తగా ఎవరైనా వస్తే వారిని పరిచయం చేయలేదంటూ ఊగిపోయారు. ఎంపీడీవో కృష్ణయ్య వారికి నచ్చచెబుతూ తాను ఇటీవలే వచ్చానని, అన్ని విషయాలు అవగాహన చేసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అయినా ససేమిరా అంటూ వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు అధికారులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెండు రోజుల్లో తాను సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీవో చెప్పడంతో శాంతించిన ఎంపీపీ నిరసన విరమించి సమావేశాన్ని ప్రారంభించారు. అధికారులు వర్సెస్ ప్రజాప్రతినిధులు అన్న రీతిలో ఆద్యంతం సమావేశం కొనసాగింది. ఏ అధికారి మాట్లాడినా తమకు ఏమీ చెప్పలేదని, ఎవరికి చెప్పి ఆ పనులు చేశారని ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచులు ప్రశ్నించారు. తహశీల్దార్ సమావేశానికి రాకుండా డీటీని పంపారని, ఇకపై మీరు రావద్దని డీటీపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండ్రాజకుప్పం దళితవాడ సర్పంచ్ జయపాల్ మాట్లాడుతూ మేడమ్‌గారు.. అభివృద్ధి జరగలేదంటూ పదేపదే చెబుతున్నారని, మేము సీసీరోడ్లు, గోశాలలు, నీటితొట్టెలు వేయించామన్నారు. తానొక దళిత సర్పంచ్‌నని వైసీపీ ప్రభుత్వంలో తమ గ్రామం పక్కన గల కొండలు తవ్వరాదని దానిపై సమావేశానికి రావాలంటూ దండోరా వేయిస్తే తనను జైలులో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అండగా ప్రభుత్వం

● డీపీవో సుధాకర్ రావు



కూల్ బీచ్ జ్యూస్ ఫ్యాక్టరీ యజమానితో మాట్లాడుతున్న డీపీవో సుధాకర్‌రావు

పూతలపట్టు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకుంటుందని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు అన్నారు. పి.కొత్తకోట సచివాలయంలో గురువారం మామిడి రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడి రైతులకు ఏవైనా సమస్యలుంటే మండలస్థాయి అధికారులను సంప్రదించాలని కోరారు. అనంతరం కూల్ బీచ్ జ్యూస్ ఫ్యాక్టరీ యజమాని నాగరాజ్‌తో మాట్లాడుతూ మామిడి రైతులను ఇబ్బంది పెట్టకుండా, టోకెన్లు మంజూరుచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, డీటీ మునిక్రిష్ణ, ఎంపీడీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఐరాల,(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకాంపల్లెలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున ప్రతి మామిడి రైతు పంటను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు.



చినకాంపల్లెలో మామిడి రైతులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ధనలక్ష్మి

● యాదమరి (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, వ్యవసాయశాఖ ఏవో దీప ఆధ్వర్యంలో దాసరాపల్లి, 184 గొల్లపల్లి సచివాలయాల పరిధిలోని మామిడి రైతులకు ప్రత్యేక రైతు సమావేశాలు నిర్వహించారు. తహసీల్దార్ పార్థసారథి మాట్లాడుతూ తోతాపురి మామిడి కాయలు కొనుగోలు చేసేందుకు మార్కెటింగ్ శాఖ ఏడీ సహకారంతో దాసరాపల్లి వద్ద ర్యాంప్‌కు అనుమతి మంజూరు చేశామని చెప్పారు. రైతులకు కనీస మద్దతు ధర రూ.5 తగ్గకుండా ఏరోజు ధరలు ఆరోజు స్థానిక సచివాలయ సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు హేమగిరి, గోపి గౌడ్, సర్పంచ్ పరంధామయ్య గౌడ్, రైతులు పాల్గొన్నారు.





చెట్టుపైనే రంగుమారి కుళ్లిపోతున్న మామిడి, మాట్లాడుతున్న పార్థసారథి

చెట్లపైనే కుళ్లిపోతున్న మామిడి

అకాల వర్షాలు కురవడంతో మామిడికాయలు చెట్లపైనే రంగుమారి పురుగులు పట్టి కుళ్లిపోవడం మొదలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● విజయపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరిపురంలో నారపరాజుకండ్రిగ, మహారాజపురం, మల్లారెడ్డికండ్రిగ మామిడి రైతులకు తహసీల్దార్ కిరణ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కేవీబీపురం మామిడి ఫ్యాక్టరీలో రైతులకు ఇబ్బంది లేకుండా, ట్రాక్టర్లను గంటల తరబడి వేచి ఉంచకుండా ఏర్పాటు చేస్తామన్నారు. పరిపక్వానికి వచ్చిన మామిడిని నూర్పిడి చేయాలని, రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, మామిడి రైతులు బాలసుబ్రహ్మణ్యం రాజు, దశరథరాజు, రాజశేఖర్‌రాజు, చినబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

● వెదురుకుప్పం(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు మామిడి కాయలు పక్వానికి వచ్చాక అవగాహనతో కోతలు కోయాలని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి సూచించారు. కార్వేటినగరం మండలం అమ్మపల్లి, కత్తెరపల్లి, ఆన్నూరు గ్రామాల్లో మామిడి రైతులకు గ్రామసభలను నిర్వహించారు. మామిడి పంటపై రైతుల సమస్యలను గుర్తించి అవగాహన కల్పించారు. అలాగే అన్నూరు వద్ద ఉన్న ఏబీసీ మామిడి జ్యూస్ ఫ్యాక్టరీని కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో సందర్శించారు.



అన్నూరు వద్ద ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో తనిఖీ చేస్తున్న ఎంపీడీవో చంద్రమౌళి

● మామిడి రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెదురుకుప్పం వ్యవసాయ అధికారి సి.వనిత తెలిపారు. వెదురుకుప్పం మండలం టీకేఎంపురం, మాంబేడు గ్రామాల్లో మామిడి కొనుగోలు కార్యక్రమంపై అవగాహనకు గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో పురుషోత్తం, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదినోత్సవం



కేక్ తినిపించుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నగరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదినోత్సవాన్ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు నటరాజ మొదలియార్, డీసీసీ ఉపాధ్యక్షులు డిల్లీ, దేశయ్య, చిరంజీవిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు అల్లా పిచ్చి, కుమార్, రత్నం, ఫజుల్ భాయ్, దేశయ్య, చిన్ని, చందు తదితరులు పాల్గొన్నారు.

మాస మహిళా దినోత్సవం



ప్రసూతి వార్డులో స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి భక్తులు

చిత్తూరు కల్చరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో గురువారం మాస మహిళా దినోత్సవ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో బాలింతలకు, పురిటి బిడ్డలకు స్వామి వారి ప్రసాదాలతో కూడిన కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు యస్.మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, శేషనారాయణ, రుక్మిణి, రత్న, నిర్మల, లక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

వెదురుకుప్పం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దామరకుప్పం గ్రామానికి చెందిన టీడీపీ మహిళా కార్యకర్త వనజాక్షి(53) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు గురువారం ఆ గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరిలో తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్, నాయకులు కఠారి మోహన్‌రెడ్డి, చెంగల్రాయులు, యోగేశ్వర్, మురళిరెడ్డి, లోకేశ్ ఉన్నారు.

ఏర్పేడు కేవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఏర్పేడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ఏర్పేడు ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయంలో పలు తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రమేస్ బజ్జూరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు నేరుగా తమను సంప్రదించవచ్చన్నారు: 1వ తరగతిలో ఎస్టీ 1, సీడబ్ల్యూఎస్ఎన్ 1, 2వ తరగతిలో ఎస్టీ 1, 3వ తరగతిలో ఎస్టీ 1, 4వ తరగతిలో 26, 5వ తరగతిలో ఎస్సీ 1, ఎస్టీ 1ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పల్లం పాఠశాలలో శ్రీలంక ప్రతినిధులు



ఏర్పేడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో విద్యావ్యవస్థ అధ్యయనంలో భాగంగా శ్రీలంకకు చెందిన సుమారు 45మంది విద్యావేత్తలు గురువారం మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బోధనా విధానం, ఉపాధ్యాయల పనితీరు పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో సమకూర్చిన వసతులపై వారు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. భారతదేశంలో విద్యావ్యవస్థ చాలా పటిష్ఠంగా ఉందని శ్రీలంక ప్రతినిధులు మహేందర్, ఫెరారీ కొనియాడారు. శ్రీలంక మహిళా ఉపాధ్యాయులు తమ దేశ సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. అనంతరం వారిని ఉపాధ్యాయులు సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, శ్రీనివాసులు, బాబు, సోమశేఖర్, వాణి, విజయ, శేఖర్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచండి

● రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్



తిరుపతి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జీఎం అరుణ్ కుమార్ జైన్

తిరుపతి(సెంట్రల్), జూన్19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచాలని సికింద్రాబాద్ జోనల్ జీఎం అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో గురువారం ఆయన తనిఖీ చేశారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఉత్తరం వైపు జరుగుతున్న పనుల్లో ఆలస్యంపై ఆరా తీశారు. నిర్ణీత సమయంలోపు భవనాల నిర్మాణాలను పూర్తి చేసి అప్పగించాన్నారు. ఈ తనిఖీల్లో జోనల్, డివిజన్ స్థాయి అధికారులు సీఈ కె.సూర్యనారాయణ, డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, మల్లాడి శ్రీనివాస్, జి.వామనమూర్తి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, మణికంఠ, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నప రెడ్డి, ఎస్ఎస్ఈ మాధవరావు తదితరులు పాల్గొన్నారు. ఈ నెలాఖరుకు జీఎం అరుణ్ కుమార్ జైన్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా అధికారులు ఘనంగా సన్మానించారు.

84 వేల మందికి సికిల్ సెల్ అనీమియా పరీక్షలు



సికిల్ సెల్ అనీమియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

తిరుపతి(వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'సికిల్ సెల్ అనీమియా.. వారసత్వంగా వచ్చే వ్యాధి. దీని నివారణకు జిల్లాలో విస్తృతంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికి 84 వేల మందికి పరీక్షలు నిర్వహించగా నెగటివ్ వచ్చింది' అని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ తెలిపారు. ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినం సందర్భంగా గురువారం తిరుపతిలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2047 నాటికి సికిల్ సెల్ అనీమియాను పూర్తిగా తొలగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటికే 1,24,000 మందికి సికిల్ సెల్ అనీమియాకు స్క్రీనింగ్ పరీక్షలు చేయాల్సి ఉండగా.. వీరిలో 84 వేల మందికి పరీక్షలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


జన్మదిన శుభాకాంక్షలు
శ్రమించడం ఆయన సుగుణం
సాధించడం ఆయన నైజం
తండ్రి ఆశయ సాధనే ఆయన ధ్యేయం
ప్రజా శ్రేయస్సే ఆయన లక్ష్యం
మచ్చలేని మహామనిషి, మా శ్రేయోభిలాషి
నగరి శాసనసభ్యులు
శ్రీ గాలి భానుప్రకాష్ గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
డా॥ గోవిని బాలసుబ్రమణ్యం
MBBS, MS, MCh (C TVS), FIACS,
Director, C TVS &
Thoracic Organ Transplantation
గోవిని బాబు నాయుడు
నగరి నియోజకవర్గం
చిత్తూరు జిల్లా
గోవిని రమేష్ నాయుడు
నగరి నియోజకవర్గం
చిత్తూరు జిల్లా
పి.లోకనాథం నాయుడు
నింద్ర మండలం టీడీపీ మాజీ అధ్యక్షులు,
మాజీ సర్పంచ్, చవరంబాకం గ్రామం
నగరి నియోజకవర్గం, చిత్తూరు జిల్లా
ఉదయ్
చిట్టి
విష్ణు
శ్రీ గాలి భానుప్రకాష్ గారు
నగరి శాసనసభ్యులు
నింద్ర మండలం టీడీపీ నాయకులు, ప్రజలు
నగరి నియోజకవర్గం


జన్మదిన
శుభాకాంక్షలు
జనహృదయ భావినాయకుడు.... తండ్రి ఆదర్శాలతో పయనిస్తూ...
మార్గనిర్దేశం చేస్తున్న మార్గదర్శకుడు... మా ఆశల ఆకాంక్షల
యువనేత నగరి శాసనసభ్యులు శ్రీ గాలి భానుప్రకాష్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ... రేపటితో ఎమ్మెల్యేగా
ప్రమాణస్వీకారం చేసి ఏడాది పూర్తవుతున్న
సందర్భంగా
అభినందనలతో...
శ్రీ గాలి భానుప్రకాష్ గారు
శాసనసభ్యులు, నగరి
ఎం.యువరాజ్ నాయుడు
TNTUC రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి
చంద్రబాబు నాయుడు
టిడిపి సీనియర్ నాయకులు

రేపు 6వేల మందితో యోగా దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం చిత్తూరులో యోగా కార్యక్రమాన్ని భారీస్థాయిలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పోలీసు పరేడ్ మైదానం లేదా మెసానికల్ గ్రౌండ్‌లో ఆరువేల మందితో ఈ కార్యక్రమం జరగనుంది. వినూత్నరీతిలో గోళాకారంలో ఆరు కంపార్టుమెంట్లుగా విభజించి ఒక్కో కంపార్టుమెంటలో 900 మంది యోగాసనాలు వేసేలా ఏర్పాటు చేస్తున్నారు. అంతకుమించి ఉత్సాహంతో వచ్చే ప్రజలను గ్యాలరీల్లో సర్దుబాటు చేస్తారు. ఇందుకోసం ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరితోపాటు జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు వంటి ప్రజాప్రతినిధులు పాల్గొనాలంటూ ఆహ్వానాలు పంపారు. విశాఖపట్నంలో పీఎం మోదీ యోగా ప్రారంభించే సమయానికి ఇక్కడ ప్రారంభించేలా షెడ్యూలు ఖరారు చేస్తున్నారు.

5,508 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు

జిల్లావ్యాప్తంగా శనివారం 5,508 ప్రాంతాల్లో భారీఎత్తున యోగా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై గురువారం సాయంత్రం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లాస్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగా దినోత్సవ కార్యక్రమాలను గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటుచేసుకునేలా పకడ్బందీగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో పేర్లు నమోదు చేసుకున్నవారితో యోగా కార్యక్రమం జరపాలని చెప్పారు. యోగా కార్యక్రమాలు జరిగే ప్రదేశాల వద్ద అన్ని వసతులు కల్పించాలని ఆదేశాలిచ్చారు.

యోగా పోటీల్లో జిల్లాకు రెండు బహుమతులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలు ఈనెల 16 నుంచి 18వ తేదీవరకు విజయవాడలో జరిగాయి. విజేతలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం బహుమతులు అందజేశారు. దీనికి మన జిల్లా నుంచి 11 విభాగాల పోటీల్లో 25 మంది అభ్యర్థులు పాల్గొనగా.. రెండు బహుమతులు వచ్చాయి. సీనియర్స్ యోగా విభాగం క్విజ్ పోటీల్లో కె.కరుణ.. ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. జూనియర్స్ విభాగంలో ఆసనాలు వేయడంలో కుషన్‌కుమార్, నిఖిత, ఎస్.భార్గవ్ రెడ్డి, హర్ష, ప్రీతమ్‌లు బృందంగా తృతీయ బహుమతి పొందారు. విశాఖపట్నంలో శనివారం నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వీరంతా హాజరు కానున్నాయి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుతో కలిసి యోగాసనాలు వేస్తారు.

నెలాఖరులోగా భూపట్టా విభజనకు అవకాశం

● జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పూర్తిచేసిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు వారి భూములను విభజించుకునేందుకు నామమాత్రపు రుసుంతో ఈనెలాఖరులోగా ప్రభుత్వం అవకాశం కల్పించిందని జేసీ విద్యాధరి తెలిపారు. వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదు కాబడిన భూయజమానులు వారి భూముల విభజనకు గతంలో రూ.500 రుసుంగా ప్రభుత్వం నిర్ణయించగా, దానిని పూర్తిగా మినహాయింపు కల్పించి ఉచితంగా ఈసేవ పొందేందుకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఇందుకు కేవలం రూ.50 దరఖాస్తు రుసుం స్థానిక సచివాలయంలో చెల్లించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో ఇబ్బంది ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యం ఇవ్వబడుతుందని సూచించారు.

ఉచిత న్యాయసేవలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి

చిత్తూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఉచిత న్యాయసేవలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి అన్నారు. గురువారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో మానసిక వికలాంగులకు న్యాయపరమైన సేవలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా సమాజంలో వారి పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవచ్చని చెప్పారు. ఉచిత న్యాయసేవలు ఎలా పొందాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవి, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


చంద్రశేఖర్ నాయుడు (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో పాపానివారిపల్లె బస్టాప్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు రూరల్ మండలం కోడిగుంటపల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ నాయుడు, అతడి కుమారుడు యుగేష్ ట్రాక్టర్‌లో మామిడి కాయలను తీసుకొచ్చి బంగారుపాళ్యం మార్కెట్‌లో విక్రయించి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా, బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో కూర్చుని ఉన్న చంద్రశేఖర్ నాయుడు ఎగిరి కిందపడ్డాడు. దీంతో ట్రాక్టర్ ఇంజిన్, ట్రాలీ వేరుకావడంతో ట్రాలీ వచ్చి చంద్రశేఖర్ నాయుడు(62)పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యుగేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు సైకిల్ పంపిణీ


అంజాద్‌కు సైకిల్‌ను అందజేస్తున్న తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్

బంగారుపాళ్యం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త అంజాద్‌బాషాకు సైకిల్ అందజేశారు. అంజాద్ బంగారుపాళ్యం మండలం కేంద్రంలోని జెండామాను వీధికి చెందిన తెలుగుదేశం పార్టీ వీరాభిమాని. ఈయన గత నెల కుప్పం పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చినప్పుడు ఆయన్ను కలిసి సైకిల్ మంజూరు చేయాలని విన్నవించుకున్నారు. అంజాద్‌కు ఓ సైకిల్ ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సీఎం ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ చొరవతో గురువారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ అంజాద్‌కు సైకిల్ అందజేయడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ డీటీ బాబు, వీఆర్వోలు సునీల్‌కుమార్, గోవిందయ్య, విజయ్ ఉన్నారు.

పూతలపట్టులో అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పూతలపట్టు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల కేంద్రంలో అన్నక్యాంటీన్ ఏర్పాటుకు గురువారం తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో నాగరాజుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ సమీపాన నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండును పరిశీలించారు.

టమోటా ధరలు పతనం

తోటల్లో విచ్చలవిడిగా తెగుళ్లు ● ఆందోళనలో రైతులు


టమోటా కాయలపై ఏర్పడుతున్న నల్ల మచ్చలు - టమోటా తోటల్లో ఊజీ ఈగల నివారణకు ఏర్పాటు చేస్తున్న బాక్సులు

సోమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు తగ్గుముఖం పట్టాయి. గురువారం 15 కిలోల బాక్సు కేవలం రూ.130కి చేరింది. నాణ్యత ఉన్న 15 కిలోల టమోటా బాక్సు రూ.150 మాత్రమే పలికింది. మిగిలిన రకాలు రూ.60 నుంచి రూ.70 మాత్రమే అమ్మకాలు జరిగాయి. కర్ణాటక రాష్ట్రంలోని టమోటా మార్కెట్‌లో పరిస్థితి ఇలాగే కొనసాగుతోంది. అనంతపురం జిల్లా నుంచి దిగుబడుల ప్రారంభంతో జిల్లాలోని ప్రముఖ మార్కెట్లలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. వీటికితోడుగా జిల్లాలో కొద్దిపాటి వర్షాలకే టమోటా తోటల్లో విచ్చలవిడిగా చీడపీడలు వ్యాప్తి చెందుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాయలపై మచ్చలు ఏర్పడుతున్నాయి. అలాగే పచ్చగా ఉన్న మొక్కలు వాడుముఖం పడుతున్నాయి. ఈక్రమంలో అధిక మోతాదుల్లో మందులు పిచికారీ చేస్తున్నా అదుపులోకి రావడం లేదు. 10బాక్సుల కాయలు కోస్తే 5 బాక్సుల మేరకు నల్ల మచ్చల కాయలే ఉంటున్నాయి. వీటిని మార్కెట్‌కు తరలిస్తే 15 కిలోల బాక్సు రూ.50 ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైరస్ సోకి దిగుబడులు తగ్గి తోటలే లేకుండా పోయాయని రైతులు ఆందోళన పడుతున్నారు. వేలకు వేలు మందుల పిచికారీ చేసినా ఫలితం లేకపోతోందని రైతులు వాపోతున్నారు. వీటికి తోడు పండు ఈగల (ఊజీ ఈగ) ఉధృతి పెరిగి కాయలు నాణ్యత లేకపోవడంతో ధరలు ఉండటం లేదు. వ్యాపారులు కొనుగోలు చేయలేక పోతున్నారు. ఊజీ ఈగల నివారణకు రైతులు మరింత మందులు పిచికారీ చేయడంతో ఖర్చులు పెరిగిపోతున్నాయి. పెట్టుబడులు రాక ఇబ్బందులు పడుతున్నారు.

కత్తులతో దాడిచేసి మాపైనే నిందలా?

ఇలాగే వ్యవహరిస్తే వైసీపీ ఎమ్మెల్సీ భరత్‌ను కుప్పంలో అడుగుపెట్టనివ్వం ● టీడీపీ శ్రేణుల హెచ్చరిక


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కుప్పం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'అంగన్వాడీ కార్యకర్తపై కత్తులతో వైసీపీ నేత దాడిచేసి.. హత్యాయత్నానికి తెగబడిందే కాక, మళ్లీ మాపైనే నిందలు వేయడం దారుణం' అని కుప్పం మండలానికి చెందిన టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. అలాగే హైదరాబాదులో కూర్చొని.. ఇక్కడి కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం మానుకోకుంటే వైసీపీ ఎమ్మెల్సీ భరత్‌ను కుప్పంలో అడుగుపెట్టనివ్వమని హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలానికి చెందిన కొందరు పార్టీ నాయకులతో పాటు, రాగిమానుమిట్ట గ్రామస్తులు మీడియాతో మాట్లాడారు. వైసీపీకి చెందిన మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అక్తర్‌యే తనమీద కత్తులతో దాడి చేసినట్లు బాధితురాలైన అంగన్వాడీ కార్యకర్త నజ్మా స్వయంగా చెప్పిందన్నారు. అయితే ఇదంతా చేయించింది టీడీపీ మండల అధ్యక్షుడేనంటూ అక్తర్.. సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేయడాన్ని ఖండించారు. వైసీపీ హయాంలో అప్పటి పాలకులు, నాయకులు తమపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టి వేధించినా, వాటన్నింటిని మరిచిపోయి, శాంతి సామరస్యాలతో కుప్పం ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో అభివృద్ధిపైనే దృష్టి పెట్టామన్నారు. కానీ వైసీపీ ఎమ్మెల్సీ భరత్ మాత్రం కులాలు, మతాలను రెచ్చగొట్టి.. రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ వచ్చాక రాగిమానుమిట్టలో అక్తర్.. అరాచకాలు, దాడులు అధికమైపోయాయన్నారు. నాలుగైదు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆయనపై రౌడీషీట్ కూడా ఉన్నదని చెప్పారు. వెంటనే అతడిని అరెస్టు చేసి.. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, మైనారిటీ సెల్ మండల నాయకుడు హైదర్ వలి, స్థానిక యూనిట్ ఇన్‌చార్జి శివకుమార్, కుప్పం మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు వసంతమ్మ, తెలుగు యువత కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి మణి, కంగుంది సర్పంచి ధనశేఖర్, నాయకులు అశోక్, జేకే సంతోశ్, బాధితురాలు నజ్మా భర్త అంజత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారు తాకట్టు పెట్టిన కేసులో ఐదుగురి అరెస్టు

పలమనేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని ఓ ప్రైవేటు బ్యాంకులో గత మార్చి నెలలో నకిలీ బంగారు తాకట్టు పెట్టిన కేసులో గురువారం ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ నరసింహరాజు తెలిపారు. బ్యాంకు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అప్పట్లో 8మందిని అరెస్టు చేయగా దర్యాప్తులో మరో ఐదుగురు శంకరయ్య, బోస్‌రెడ్డి, గణేష్, నరేష్‌కుమార్, ప్రకాష్‌ల ప్రమేయం ఉందని గుర్తించారు. వీరిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్


క్లినిక్‌కు తాళం వేస్తున్న రాళ్లబూదుగూరు డాక్టర్ శివకుమారి

శాంతిపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల పరిధిలోని కనమలదొడ్డిలో నిర్వహిస్తున్న ఆర్ఎంపీ క్లినిక్‌ను రాళ్లబూదుగూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొంతకాలంగా శింగారువేలు అనే వ్యక్తి ఈ క్లినిక్ నిర్వహిస్తున్నాడు. 25 రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన వేలు అతని వద్ద వైద్యం చేసుకోవడంతో మృతి చెందాడని బంధువులు వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు, ఆర్ఎంపీగా ఎలాంటి అర్హతలు లేకపోవడంతో మందలించి సీజ్ చేశారు. కార్యక్రమంలో రాళ్లబూదుగూరు ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానముంటే వేలి ముద్ర వేయాల్సిందే

● గత నెలలో 1650 మంది నుంచి సేకరించిన పోలీసులు

● నిందితుల గుర్తింపులో కీలకంగా పాఫిలాన్, లైవ్ స్కానర్లు


ఫాపిలాన్


లైవ్ స్కానర్ ద్వారా వేలిముద్రల సేకరణ.. పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

ఎవరైనా అనుమానాస్పద స్థితిలో కనిపించారంటే చాలు.. పోలీసులు వారి వేలి ముద్రలు సేకరిస్తున్నారు. అలాగే, పాఫిలాన్, లైవ్ స్కానర్ల ద్వారా వేలి ముద్ర వేయగానే ఆ వ్యక్తులకు నేరచరిత్ర ఉంటే తెలిసిపోతుంది. ఇక, నేరఘటనల్లో వేలిముద్రలను ట్యాలీ చేసి నిందితులను పట్టుకునేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. ఇటీవల మధ్యప్రదేశ్ గ్యాంగ్‌ను తిరుపతి పోలీసులు ఇలాగే పట్టుకున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేరగాళ్లు పోలీసులను ఏమార్చేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మరోవైపు పోలీసులూ వారిని పట్టుకునేందుకు.. భవిష్యత్తులో దొంగతనాలకు పాల్పడినా గుర్తించేలా సాంకేతికతను అంది పుచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న ఫాపిలాన్, లైవ్ స్కానర్ల ద్వారా వేలి ముద్రలు, అరచేతి ముద్రలు సేకరిస్తున్నారు. ఈ వివరాలు నేరగాళ్లను గుర్తించడంలో పోలీసులకు సహాయ పడుతున్నాయి. గతంలో వేలి ముద్రలు సేకరించే పనులు చాలా మందకొడిగా సాగేవి. ఇటీవల నేరాలు పెరగడం, గంజాయి, బహిరంగంగా మద్యం తాగడం, మహిళలు, వేధింపులు, చిన్నారులపై అఘాయిత్యాలు, ఇంటి దొంగతనాలు, దోపిడీలు, ద్విచక్ర వాహనాల చోరీ, బస్టాండు, రైల్వే స్టేషన్‌లో చైన్ స్నాచింగ్‌లు, పిక్‌ప్యాకెట్లు పెరిగాయి. ఫాపిలాన్‌తో పాటు లైవ్ స్కానర్లను వినియోగించి ఈ ఘటనల్లో నిందితులను గుర్తించే పనులు చేపట్టారు. అదే సమయంలో అనుమానితుల వేలి ముద్రలు సేకరించే పనులూ సాగుతున్నాయి. గత నెలలో దాదాపు 1650 మంది వేలి ముద్రలు సేకరించారు. ఇలా వేలి ముద్రల సేకరణలో రాష్ట్రంలోనే తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఎస్పీ హర్షవర్ధన్‌కు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అభినందనలు తెలుపుతూ కీపిటప్ అని ప్రశంసించారు.

● ఇటీవల తిరుచానూరు, తిరుపతి ఈస్ట్ పరిధిలో జరిగిన మారుతీ షోరూముల్లో దోపిడీ ఘటనల్లో వేలి ముద్రల ఆధారంగానే మధ్యప్రదేశ్ గ్యాంగ్‌ను పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు.

● తిరుపతిలోని విష్ణునివాసంలో రోజూ 20 నుంచి 30 మొబైల్ ఫోన్లు, బంగారు నగలు, విలువైన వస్తువులు చోరీకి గురయ్యేవి. బాధితులు ఫిర్యాదు ఇవ్వడం తప్ప న్యాయం జరిగిన ఘటనలు చాలా తక్కువ. ఈ క్రమంలో విష్ణునివాసంలో లైవ్ స్కానర్ ఏర్పాటు చేసి అనుమానితులు, పాత నేరస్థుల వేలి ముద్రలు సేకరించే పనులు చేపట్టారు. ఇలా విష్ణునివాసం, శ్రీనివాసం వద్ద వారం కిందట 15 మందిని ఒకసారి, ఐదుగురిని మరోసారి గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 20 సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. దీంతో అక్కడ దొంగతనాలు తగ్గు ముఖం పట్టాయి.

జిల్లాలో 13,187 సీసీ కెమెరాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా బ్లాక్ స్పాట్స్, ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, మారుమూల పల్లెలు, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నాలుగు నెలలుగా దాదాపు 13,187 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా గరుడ ఫ్లైఓవర్‌పై ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరిగి పోవడం, ఆకతాయిల ఆగడాలు ఎక్కువ కావడం, అర్ధరాత్రి పూట మత్తు పదార్థాల వినియోగం పెరగడంతో ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. త్వరలో ఇంకా కీలకమైన ప్రదేశాల్లో అమర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రైల్వే స్టేషన్, బస్టాండులోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో భిక్షగాళ్ల సందడి, నేరస్థుల కదలికలు తగ్గుముఖం పట్టాయి. విష్ణునివాసంలో బంగారం ఉండే బ్యాగు తీసుకెళ్తుంటే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకున్నారు.

కూటమిలో కోవర్టులు!

తిరుపతి నగరపాలక కౌన్సిల్ సమావేశంలో బట్టబయలు ● ఆలోచనలో పడ్డ నేతలు

తిరుపతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎన్డీఏ కూటమిలో కోవర్టుల భయం పట్టుకుంది. నగరపాలక సంస్థకు చెందిన ఓ స్థలాన్ని విక్రయించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై జరిగిన కౌన్సిల్ సమావేశంలో కొందరు కార్పొరేటర్ల వ్యవహార శైలి తీవ్ర చర్చకు దారితీసింది. వైసీపీ కండువా తీసి కూటమి కండువాలు కప్పుకున్నారు గానీ గత పార్టీ భావజాలం మాత్రం అలాగే ఉందనే వాదన కౌన్సిల్ సమావేశంలో స్పష్టమైంది. అధికార పార్టీతో ఉంటే అన్ని పనులు చక్కబెట్టుకోవచ్చనే స్వార్థంతోనే కండువాలు వేసుకుని కొందరు, వేసుకోకుండా మరికొందరు తిరుగుతున్నారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. కార్పొరేషన్ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు కూటమి మద్దతు కార్పొరేటర్లు ప్రతిపక్ష పార్టీ నిర్ణయానికి అనుకూలంగా కనిపించి కూటమి నేతలకు షాక్ ఇచ్చారు. సాక్షాత్తు కౌన్సిల్ ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఎదుటే కూటమి నిర్ణయానికి అడ్డుతగలడం ఆశ్చర్యానికి గురిచేసింది. సమావేశం అనంతరం ఎమ్మెల్యే కూడా కార్పొరేటర్ల వ్యవహారశైలిపై నాయకుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. కౌన్సిల్ సమావేశానికి ముందురోజే తిరుపతిని అమ్మేస్తున్నారంటూ కూటమి ప్రభుత్వ పెద్దలను తిట్టిపోస్తూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే డిప్యూటీ మేయర్లు, కూటమిలోని మహిళా కార్పొరేటర్లు మినహా గట్టిగా గొంతెత్తి ఖండించాల్సిన సీనియర్ కార్పొరేటర్లు మాత్రం సెటైర్లు వేసుకోవడం ఎమ్మెల్యేని నివ్వెరపరిచింది. అయినప్పటికీ కౌన్సిల్ సమావేశం అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడే సమయంలోనూ వైసీపీని ఖండించని కార్పొరేటర్లనే పక్కన పెట్టుకున్నారు. కూటమిలో విలువ, స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ కొందరు ఇంకా వైసీపీ బంధం నుంచి బయటపడకపోవడంలేదన్న అనుమానాలు బలపడుతున్నాయి. వైసీపీ నేతల కనుసన్నల్లోనే సదరు కార్పొరేటర్లు పనిచేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కూటమిలో కోవర్టులను పెట్టుకుని రాజకీయాలు ఎలా చేయాలంటూ నాయకులు మదనపడుతున్నారు. ఇకనైనా ఇలాటివారిపట్ల అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నారు.

వారి సభ్యత్వాన్ని రద్దు చేయండి

మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన చాణక్య హోటల్ విక్రయానికి అనుకూలంగా ఓటేసిన వైసీపీ కార్పొరేటర్ల సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆపార్టీకి చెందిన మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు గురువారం కమిషనర్ మౌర్యకు వినతిపత్రం అందజేశారు. కౌన్సిల్ సమావేశానికి ముందు తమ పార్టీ కార్పొరేటర్లకు విప్ జారీ చేసినా కొందరు ధిక్కరించి కూటమికి అనుకూలంగా మాట్లాడారన్నారు. కమిషనర్‌ను కలిసినవారిలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఉమా అజయ, ఆరణి సంధ్య, అమరనాథ్ రెడ్డి, అనిల్ తదితరులు ఉన్నారు.

'కొండ'పై భక్తులకు మరిన్ని ఉచిత బస్సులు

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులను ట్యాక్సీ దోపిడీ నుంచి రక్షించేలా మరిన్ని ఉచిత బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. తిరుమలలో ప్రస్తుతం 10 శ్రీవారి ధర్మరథాలు(ఉచిత బస్సులు) అందుబాటులో ఉన్నాయి. ఇవి తిరుమలలోనే ఉంటూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరవేస్తుంటాయి. ఇటీవల తిరుమలలోని ట్యాక్సీలు భక్తులను నుంచి అధిక మొత్తం ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులున్న క్రమంలో టీటీడీ ఓ నూతన ఆలోచన చేసింది. తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే ఆర్టీసీ బస్సులను కూడా ఫ్రీ సర్వీసుకు వినియోగించాలని నిర్ణయించింది. దీనికి ఆర్టీసీ అధికారులు అంగీకారం తెలపడంతో తొలిదశలో గురువారం 80 ఆర్టీసీ బస్సులను ఉచిత రవాణాకు అందుబాటులోకి తీసుకొచ్చారు. భక్తులకు ట్యాక్సీల ఛార్జీల భారం తగ్గించడంతో పాటు తిరుమలలో పర్యావరణ పరిరక్షణ, వాహన శబ్ద కాలుష్య నివారణకు ఈ విధానం ఉపయోగంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఆర్టీసీలో ఉచిత ట్రిప్పులను గురువారం ప్రారంభించి.. ఆ బస్సులో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్, టీటీడీ రవాణా జీఎం శేషారెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటరావు, డిప్యూటీ సీఎంఈ బాలాజీ, డిపో మేనేజర్ శ్రీహరి తదితరులు కొంతదూరం ప్రయాణించారు.

ఏయే ప్రాంతాల్లో తిరుగుతాయంటే..

తిరుపతి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు తొలుత తిరుమలలోని బాలాజీ బస్టాండ్‌కు చేరుకుంటాయి. అక్కడ ప్రయాణికులు దిగాక.. అదే బస్సు శ్రీవారి ధర్మరథాలు తిరిగే రూట్‌లోకి ప్రవేశిస్తుంది. శంఖుమిట్ట(ఎస్ఎంసీ), వైకుంఠం 1, ఎస్వీ గెస్ట్‌హౌస్, కృష్ణతేజ సర్కిల్, వైకుంఠం 2, ఎస్వీ మ్యూజియం, మఠాలు, వరాహస్వామి విశ్రాంతి గృహాలు, నందకం, రాంభగీచ, లేపాక్షి సర్కిల్, సీఆర్వో కార్యాలయం మీదుగా తిరిగి జీఎన్సీ టోల్‌గేట్‌కు చేరుకుంటుంది. తిరుపతి నుంచి వచ్చే భక్తులు ఈ ప్రాంతాల్లో ఎక్కడైనా దిగచ్చు. ఈ ప్రాంతాల్లో ఎక్కే ప్రయాణికులు జీఎన్సీ టోల్ గేట్ వరకు తమకు కావాల్సిన ప్రాంతాల్లో దిగచ్చు. జీఎన్సీ తర్వాత తిరుపతి వెళ్లే భక్తులు మాత్రమే టికెట్ కొనాలి. తిరుపతికి వెళ్లే భక్తులకు వరాహస్వామి విశ్రాంతి గృహాల వద్ద టికెట్లు విక్రయించే కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. అవసరానికి అనుగుణంగా ఈ బస్సుల సంఖ్యను 150 వరకు పెంచాలని అధికారులు భావిస్తున్నారు.

హైరోడ్డు విస్తరణలో కీలక ముందడుగు

● చిత్తూరులోని కట్టమంచి ప్రాంతంలో వంద అడుగుల సేకరణ


వెంకుసా కల్యాణ మండపం వద్ద ప్రహరీని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న సిబ్బంది

చిత్తూరు అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని హైరోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం కీలక ముందడుగు పడింది. ప్రైవేటు యజమానులను ఒప్పించి వంద అడుగుల మేర రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని సేకరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కమిషనర్ నరసింహప్రసాద్‌ల ఆదేశాలతో హైరోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏసీపీ నాగేంద్ర ఆధ్వర్యంలో ప్రణాళిక విభాగం అధికారులు గురువారం కట్టమంచి ప్రాంతంలో వెంకుసా కల్యాణ మండపం వద్ద వంద అడుగుల రోడ్డు వెడల్పు చేయడానికి అవసరమైన స్థలాన్ని సుమారు 200 అడుగుల పొడవుతో సేకరించారు. ఈ మేరకు ప్రహరీని తొలగించి రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సేకరించారు. ఇక్కడే మరికొన్ని ప్రైవేటు స్థలాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించారు.

పశువుల దాణా పంపిణీ



పాడి రైతులకు దాణా అందజేస్తున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆరిఫ్

బంగారుపాళ్యం, జూన్19 (ఆంధ్రజ్యోతి): రాయితీపై ప్రభుత్వం అందించే పశువుల దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆరిఫ్ అన్నారు. గురువారం మండలంలోని కాటప్పగారిపల్లె 50 శాతం రాయితీపై అందిస్తున్న పశువుల దాణాను ఆయన పాడి రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో 40 టన్నులు పంపిణీ చేయగా, రెండో విడతలో 38 టన్నులు వచ్చాయని, ఇవి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆసిఫ్, సిబ్బంది పావని, రైతులు పాల్గొన్నారు.


LEADER
LEADER
నగరి నియోజకవర్గ శాసనసభ్యులు
గౌ॥ శ్రీ గాలి భానుప్రకాష్ గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
గంజి మాధవయ్య
డైరెక్టర్, ఎ.పి.స్టేట్ పద్మశాలి
కార్పొరేషన్, పుత్తూరు


ప్రజాసేవకునికి
జన్మదిన శుభాకాంక్షలు
HAPPY BIRTHDAY
నగరి నియోజకవర్గాన్ని
అభివృద్ధి చేసిన
కీ॥శే॥ గాలి ముద్దుక్రిష్ణమ నాయుడు గారి
తనయుడు నగరి నియోజకవర్గ ప్రజల సంక్షేమం మరియు
అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న మా యువనాయకులు
శ్రీ గాలి భానుప్రకాష్ గారికి
ఇవే మా హార్థిక
జన్మదిన శుభాకాంక్షలు
థాశన్ అమృతరాజ్‌తో కీళపట్టు మహిళలు
గౌ॥ శ్రీ గాలి భానుప్రకాష్ గారు
ఎమ్మెల్యే, నగరి నియోజకవర్గం
థాశన్ అమృతరాజ్
నగరి మున్సిపాలిటీ


జన్మదిన
శుభాకాంక్షలు
జన హృదయనేత, మార్గదర్శకులు
మా ఆశల ఆకాంక్షల యువనేత
నగరి నియోజకవర్గ శాసనసభ్యులు
శ్రీ గాలి భానుప్రకాష్ గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు.
గౌ॥ శ్రీ గాలి భానుప్రకాష్ గారు
నగరి నియోజకవర్గ శాసనసభ్యులు
శ్రీ ఎ. శరవణ
ఆలపాకం, విజయపురం మండలం


జన్మదిన శుభాకాంక్షలు
HAPPY BIRTHDAY
నిగర్వి, నిరాడంబరులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మా ముద్దన్న కుమారుడు, నగరి ఎమ్మెల్యే
గౌ॥ శ్రీ గాలి భానుప్రకాష్ గారికి ఇవే మా జన్మదిన శుభాకాంక్షలు.
మా అన్న రాజకీయంగా మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆ కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థిస్తూ ...
గౌ॥ శ్రీ గాలి భానుప్రకాష్ గారు
నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే
ఎ.కల్పన
రేషన్ డీలర్

40 ఏళ్ల లోపు ఆదివాసీలందరూ రక్త పరీక్షలు చేయించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 0-40 ఏళ్ల లోపు ఉన్న ఆదివాసీలందరూ తప్పకుండా రక్తపరీక్షలు చేయించుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ అన్నారు. గురువారం సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా స్థానిక గాయత్రీనగర్‌లో ఉన్న గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి ఆదివాసీల్లో ఎక్కువగా వస్తుందన్నారు. ఈ వ్యాధి ఉన్న తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందన్నారు. వ్యాధి సోకిన వారు 50 ఏళ్ల లోపే మరణిస్తున్నారని, ముందుగా గుర్తిస్తే మందుల ద్వారా జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రేఖ, వైద్యాధికారి దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగాధరనెల్లూరు హైస్కూల్లో మెగా జాబ్‌మేళా

గంగాధరనెల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ సహకారంతో మండల కేంద్రమైన గంగాధరనెల్లూరు హైస్కూల్లో శుక్రవారం ఉదయం 10గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, ప్రధానకార్యదర్శి జ్యోతిరెడ్డి తెలిపారు. ఈ మెగా జాబ్‌మేళాకు నియోజకవర్గంలోని కూటమి నేతలు హాజరుకావాలని, నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

శవ రాజకీయాలు చేస్తున్న జగన్

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ విమర్శించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ కార్యకర్తల పరామర్శ పేరుతో రాష్ట్రంలో పర్యటిస్తూ పథకం ప్రకారం శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ అధికారం కోల్పోయిన ఉక్రోషంతో విధ్వంసకర శక్తిగా మారిందన్నారు. మొన్న జరిగిన పల్నాడు జిల్లా సత్తెనపల్లి జగన్ పర్యటనలో అసాంఘిక శక్తులు రెచ్చిపోయాయని అన్నారు. బెట్టింగ్ కింగ్ పిన్, క్రిమినల్ చరిత్ర ఉన్న నాగమల్లేశ్వరరావు సంవత్సరం క్రితం మరణిస్తే ఇప్పుడు పరామర్శ పేరుతో పర్యటన చేయడం కుట్రలో భాగమన్నారు. ఈ పర్యటనలో పోలీసులు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘిస్తూ వేలమందిని పోగేసుకుని వెళ్లడం, కాన్వాయ్ ఢీకొని వ్యక్తి మృతి చెందడం, పర్యటనలో మందుబాబులు, గంజాయి బ్యాచ్ చేత రెచ్చగొట్టేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, నినాదాలు చేయడం, నానా యాగీ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ప్రజలు వైసీపీ అరాచకాలను గమనిస్తున్నారని, ప్రభుత్వం అరాచక శక్తులను అణచివేసేందుకు వెనుకాడదని ఆయన స్పష్టం చేశారు.

28, 29 తేదీల్లో పురోహిత అవగాహన ధర్మప్రచార సభ

చిత్తూరు సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పురోహితులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన సభ నిర్వహించనున్నట్లు పురోహిత సంఘం సభ్యులు చెప్పారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ వ్యాప్తంగా పురోహితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 28, 29 తేదీల్లో తిరుపతిలోని కంచి మఠంలో 'పురోహిత అవగాహన ధర్మ ప్రచార సభ' నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని పురోహితులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. పురోహితులు పాణ్యం శ్రీనివాసశర్మ, సతీష్, కృష్ణమూర్తి, రామభద్ర, విఠల్‌శర్మ, విజయరాఘవాచార్య పాల్గొన్నారు.

వ్యభిచార గృహం, పేకాట స్థావరంపై దాడులు

● 11 మంది పేకాటరాయుళ్లు, వ్యభిచార గృహ నిర్వాహకురాలి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ మహేశ్వర

చిత్తూరు అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం పోలీసులు విస్తృతదాడులు నిర్వహించారు. రామ్‌నగర్‌కాలనీలోని ఓ వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకురాలిని, సంతపేటలో పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ వివరాలను రెండవ పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో సీఐ మహేశ్వర మీడియాకు వెల్లడించారు. రామ్‌నగర్‌కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో సిబ్బందితో కలిసి వ్యభిచార గృహంపై దాడి చేసి, నిర్వాహకురాలు సుమతితోపాటు మరో ఇద్దరు మహిళలు, నలుగురు విటులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశారు. అలాగే సంతపేటలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో పోలీసులు దాడులు చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న గృహాన్ని శ్యామ్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అతడిని కూడా త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో రెండవ పట్టణ ఎస్‌ఐ నుగుణ, సిబ్బంది బాబు, రాజేష్, వెంకటేశ్, ఒకటవ పట్టణ సిబ్బంది మునస్వామి, నరేష్, బాలాజీ, జనార్దన్, హాజీ, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వభూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు



గ్రావెల్ తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

పాలసముద్రం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వభూమిని ఆక్రమించినా, తమిళనాడుకు గ్రావెల్ అక్రమంగా తరలించినా కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అరుణ కుమారి హెచ్చరించారు. పాలసముద్రం మండలంలోని (తమిళనాడు సరిహద్దులోని) బాలక్రిష్ణాపురం, రామక్రిష్ణాపురం గ్రామాల్లో ఉన్న గ్రావెల్ తవ్వేసిన గుట్టను గురువారం ఆమె తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. నాలుగురోజుల క్రితం వ్యాపారులు గ్రావెల్‌ను తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు స్థానిక ప్రజలను కలసి తహసీల్దార్ విచారణచేశారు. రాత్రి పూట గ్రావెల్‌ను తరలిస్తే తమకు సమాచారం తెలియజేయాలని ఆమె కోరారు. ఆర్‌ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్, వీఆర్వోలు రమేష్ నాయుడు, వెంకటాచలం, తంగరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

25న దుకాణాల వేలం

చిత్తూరు కల్చరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని పొన్నియమ్మ గుడి వీరాంజనేయ స్వామి ఆలయానికి చెందిన మూడు వాణిజ్య దుకాణాలకు ఈనెల 25వ తేదీన వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో వెంకటరాయలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలి



పాలసముద్రం సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాలసముద్రం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాలయాల్లో పనిచేసే సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో సతీష్ ఆదేశించారు. గురువారం పాలసముద్రం సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ అయ్యప్పన్, ఈవోపీఆర్డీ రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలానికి నూతనంగా విచ్చేసిన ఎంపీడీవో సతీష్‌ను ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ శ్యామలా శివ ప్రకాష్‌రాజు, ప్రజాప్రతినిధులు, అధికారులతోకలసి బొకే అందించి, శాలువ కప్పి సన్మానించారు. ఎంపీటీసీ లిఖిత, సర్పంచులు హరి, వరదరాజు, మహేష్‌నాయుడు, త్యాగరాజన్ పాల్గొన్నారు.

ముగిసిన గంగ జాతర

విజయపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగమాంబాపురంలో రెండు రోజులపాటు నిర్వహించిన గంగమ్మ జాతర గురువారంతో ముగిసింది. గంగమ్మ సేవలో పాల్గొన్న చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబును గ్రామస్తులు శాలువా, చందన మాలతో సత్కరించారు. గంగమ్మను ఊరేగించి నిమజ్జనం చేశారు.

నేడు ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో శుక్రవారం 'ప్రజా ఫిర్యాదుల స్వీకరణ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు వినతిపత్రాలతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాన్ని జతచేయాలని ఆ ప్రకటనలో తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ నేతలు మోహన్‌రాజ్, కార్జాల అరుణ, మేషాక్, ధరణీప్రకాష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్చండి

విజయపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను బడిలో చేర్పాలని మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు పేర్కొన్నారు. గురువారం శ్రీహరిపురం ఎస్టీకాలనీలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం నిర్వహించారు. 10 సంవత్సరాల లోపు పిల్లలందరూ బడిలో ఉండాలని సూచించారు. బడిలో చేర్పిన పిల్లలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్టు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తల్లికి వందనం కూడా అందిస్తుందన్నారు.



శ్రీహరిపురంలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్చుకుంటున్న ప్రధానోపాధ్యాయులు



పాఠశాల స్థాయి తగ్గింపు తగదని

విద్యార్థుల నిరసన

వెదురుకుప్పం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం యనమలమంద మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిని ప్రాథమిక పాఠశాలగా మార్చి అక్కడి 6, 7, 8 తరగతులను ఇదే మండలంలోని ఆళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ ఆ పాఠశాల విద్యార్థులు యనమలమందలో గురువారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆ పాఠశాల స్థాయి తగ్గిస్తే తామెవ్వరం బడికి వెళ్లం అంటూ అన్ని తరగతుల విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి బడికి కూత వేటు దూరంలో నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న వెదురుకుప్పం ఎంఈవో దామోదరం అక్కడికి చేరుకున్నారు. నిబంధనల మేరకే విలీనం చేశామని 6, 7, 8 తరగతుల్లో 45 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని, జడ్పీ ఉన్నత పాఠశాలగా మార్చాలంటే 60 మంది విద్యార్థులతో పాటు కనీస వసతులు ఉండాలని నచ్చజెప్పారు. ఆళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లడానికి ట్రావెల్ అలవెన్సు ఇస్తారని చెప్పినా ససేమిరా అన్నారు. తమ గ్రామంలోనే ప్రాథమికోన్నత పాఠశాల కొనసాగించాలని భీష్మించుకున్నారు. దీంతో ఎంఈవో దామోదరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, అంత వరకు ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులు యనమలమందకు, 6 నుంచి 8 తరగతి పిల్లలు ఆళ్లమడుగుకు వెళ్లాలని, నిరసన విరమించాలని అభ్యర్థించారు. ఎట్టకేలకు నిరసన విరమించారు. తమ గ్రామంలోనే ప్రాథమికోన్నత పాఠశాల కొనసాగించాల్సిందేనని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



22న ఆలయ వార్షికోత్సవం

చిత్తూరు కల్చరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయ వార్షికోత్సవం ఈనెల 22న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రధానధర్మకర్త కృష్ణమూర్తి, అర్చకులు మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారికి రుద్రాభిషేకం, ధూపదీప నైవేద్యాలు, అన్నదానం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.



విట్‌లో ఉచిత సీటు సాధించిన పెనుమూరు విద్యార్థిని



యామిని

పెనుమూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని యామిని ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 974 మార్కులు సాధించి జిల్లాలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రమంలో అమరావతి విట్ కళాశాలలో ఇంజనీరింగ్‌లో ఉచిత సీట్ లభించింది. దీంతో తల్లిదండ్రులతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ బాల సుబ్రమణ్యం, అధ్యాపకులు విద్యార్థిని యామినిని అభినందించారు.

డాక్టర్ సుధాకర్ మృతికి కారణం ఎవరు?

గుడిపాల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కొవిడ్ సమయంలో మాస్కులు అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్‌ను దారుణంగా హింసించి చంపిన ఘటన ఎంత వరకు న్యాయమని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ప్రశ్నించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సత్తెనపల్లె పర్యటనలో తాము అధికారంలోకి వస్తే టీడీపీ కార్యకర్తలను నరుకుతాం...చంపుతాం అంటూ ప్లకార్డులతో రావడం ఎంత వరకు సమంజసం అన్నారు. జగన్మోన్‌రెడ్డి త్వరలోనే జైలుకు వెళ్లే రోజులు దగ్గర్లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.





డయేరియాపై పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ హేమశ్రీ

వెదురుకుప్పం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డయేరియాపై అవగాహన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమశ్రీ, ఉద్యోగులు పాల్గొన్నారు.



వేరుశనగ విత్తనాల పంపిణీ

పూతలపట్టు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుగు చింత పంచాయతీ పరిధిలో వున్న రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేత దాము, నాయకులు గుణశేఖర్‌రెడ్డి, యుగేష్‌రెడ్డి, వాసు, ప్రతాప్, సిబ్బంది రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత

